Visakha Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345


VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

హారిక, హాసిని
కేటరింగ్ & కుకింగ్
బ్రాహ్మణ భోజనాలు
అతి తక్కువ ధరలకే లభించును
All Function Catering (Veg) Order Taken
ప్రొప్రైయిటర్ : సంతోష్ కుమార్
Ph : 8985488221
9014911305
పెదగదిలి, సింహగిరి కోలని, విశాఖపట్నం

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 231 విశాఖపట్నం, 28 జూన్ 2024 శుక్రవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## ఏపీ డీఎస్సీ.... నోటిఫికేషన్‌కు తేదీ ఫిక్స్!



ఏపీలో మెగా డీఎస్సీ 2024 నోటిఫికేషన్ ఇచ్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రెండు రకాలుగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని సర్కార్ యోచిస్తోంది. గత ప్రభుత్వం మూడేళ్ల నుంచి టెట్ పరీక్ష నిర్వహించలేదు. అందుకే టెట్ పరీక్షల నిర్వహణతో కలిపి మెగా డీఎస్సీకి ఒక నోటిఫికేషన్ ఇవ్వాలని చంద్రబాబు ప్రభుత్వం భావిస్తోంది.

టెట్ పరీక్షల్లో అర్హత పొందిన వారికి నేరుగా మెగా డీఎస్సీకి వేరే నోటిఫికేషన్ ఇవ్వనుంది. కాగా, దీనికి సంబంధించిన నోటిఫికేషన్లు ఈ నెల 30న విడుదల కానున్నాయని సమాచారం. ఇక డిసెంబర్ 10 నాటికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చేలా మెగా డీఎస్సీ షెడ్యూల్ రూపొందించనున్నారని తెలుస్తోంది.

స్థానికులతోనే ఆయా జిల్లాల్లోని 80 శాతం టీచర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇక ఈ మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో భాగంగా ప్రభుత్వం మొత్తం 16,347 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. పాఠశాల విద్యా శాఖ పరిధిలో 13,661 టీచర్ పోస్టులు భర్తీ కానున్నాయి.

ఎస్టీ సంక్షేమ శాఖ పరిధిలో 2024 టీచర్ పోస్టులు, ఎస్సీ సంక్షేమ శాఖ పరిధిలో 439, బీసీ సంక్షేమ శాఖ పరిధిలో 170 భర్తీకానున్నాయి. అలాగే విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ పరిధిలో 49 టీచర్ పోస్టులు, బాల నేరస్తులకు విద్యా బోధన కోసం 15 టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నారు.

## జూలై 1 న ఇంటి వద్దే ఫించన్ల పంపిణీ



అమరావతి, జూన్ 27: ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పథకం అమల్లో బాగంగా నూతన ప్రభుత్వం పెంచి సామాజిక భద్రతా ఫించన్లను జూలై 1 ఫించనుదారుల ఇంటి వద్దే పంపిణీకి పటిష్టమైన ఏర్పాట్లను చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా నున్న 65,18,496 మంది ఫించనుదారులు అందరికీ పెంచిన ఫించన్లను ఒక్క రోజులోనే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేయించాలన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి ఫించన్ల పంపిణీ విషయం లో అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఒకటవ కేటగిరీలోని వృద్ధులు, వితంతువులు తదితర 11 ఉప కేటగిరీలకు చెందిన వారి ఫించను సొమ్మును రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంచిన నేపథ్యంలో జూలై 1 వ తేదీన రూ.4 వేలతో పాటు ఏప్రిల్, మే మరియు జూన్ మాసాలకు సంబంధించి పెరిగి ఫించను సొమ్ము నెలకు రూ.1,000/-ల చొప్పు మూడు మాసాల ఎరియర్స్ కలుపుకుని మొత్తం రూ.7,000/-లను పంపిణీ చేయాలని ఆదేశించారు. రెండో కేటగిరీలోని పాక్షిక దివ్యాంగులకు రూ.3 వేల నుండి రూ.6 వేలకు, మూడో కేటగిరీలోని పూర్తి స్థాయి దివ్యాంగులకు రూ.5 వేల నుండి రూ.15 వేలకు మరియు నాల్గో కేటగిరీలోని కిడ్నీ, తలసేమియా వంటి దీరకాలిక వ్యాధులతో బాధపడేవారికి రూ.5 వేల నుండి 10 వేలకు ఫించను సొమ్ము పెంచిన విధంగా పంపిణీ చేయాలని సూచించారు. మిగిలిన ఐదో కేటగిరీలోని వారికి గతంలో వలే ఎటువంటి మార్పు లేకుండా యాధావిధిగా ఫించను సొమ్మును పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

పెంచిన ఫించన్ల మేరకు జూలై 1 తేదీన రూ.4,399.89 కోట్లను 65,18,496 మంది ఫించనుదారుల ఒక్క రోజులోనే పంపిణీకి ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందులో రూ. 4,369.82 కోట్లను 64.75 లక్షల ఫించనుదార్ల ఇళ్ల వద్ద, మిగిలిన సొమ్ము రూ.30.05 కోట్లను రాష్ట్రానికి బయట ఉండే 0.43 లక్షల ఫించను దారులు, బయట చదువుకునే దివ్యాంగ విద్యార్థులకు డిబిటి పద్ధతో పంపిణీ చేయాలని ఆదేశించారు. ఇళ్ల వద్ద నగదు రూపేణా పంపిణీ చేయాల్సిన ఫించను సొమ్మును 29 వ తేదీ శనివారం నాడే సంబందిత బ్యాంకు బ్రాంచ్ ల నుండి డ్రా చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జూలై 1 న ఉదయం 6.00 గంటల నుండి ఫించనుదార్ల ఇంటి వద్దే ఫించను సొమ్మును పంపిణీ చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పాటు అవసరం మేరకు ఇతర శాఖ ఉద్యోగుల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఒక్కొక్క ఉద్యోగికి 50 గృహాలు చొప్పున ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని అప్పగించే విధంగా క్లస్టర్ల వారీగా మ్యాపింగ్ కార్యక్రమాన్ని శుక్రవారం కల్లా పూర్తి చేయాలన్నారు. సాధ్యమైనంత మేర ఒకే రోజు ఈ ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, అనివార్య కారణాల వల్ల ఇంకా ఎవరన్నా మిగిలి పోయి ఉంటే రెండో రోజు కూడా ఈ పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. ఆధార్ బయోమెట్రిక్, ఫేషియల్, ఐరిష్, ఆర్బిఐఎస్ అథంటికేషన్ ఆధారంగానే ఫించను సొమ్మును పంపిణీ చేయాలని, పెన్షన్ డిస్ట్రిబ్యూషన్ సర్టిఫికేట్ ను కూడా జారీ చేయాలని

(మిగతా 2లో)

## 70 ఏళ్లు పైబడిన వారికి ఆయుష్మాన్ భారత్



ఢిల్లీ : 70 ఏళ్లు పైబడిన పౌరులందరికీ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకం కింద ఉచిత చికిత్స అందించబడుతుందని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం ప్రకటించారు. ఉభయ సభలను ద్దేశించి నేడు ఆమె ప్రసంగిస్తూ దేశంలో 25,000 జన్ ఔషధి కేంద్రాల ప్రారంభోత్సవం శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. ఆయుష్మాన్ భారత్-ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన కింద 55 కోట్ల మంది లబ్ధిదారులకు ఉచిత ఆరోగ్య సేవలు అందించబడుతున్నాయని ముర్ము అన్నారు. ఇక నుండి 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరూ కూడా ఆయుష్మాన్ భారత్ యోజన కింద ఉచిత చికిత్స యొక్క ప్రయోజనం పొందనున్నారని రాష్ట్రపతి చెప్పారు. ఆయుష్మాన్ భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద పబ్లిక్‌గా ఫండెడ్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ అని పేర్కొన్నారు. ద్వితీయ మరియు తృతీయ ఆరోగ్య సంరక్షణ సేవల కోసం ప్రతి కుటుంబానికి సంవత్సరానికి ?5 లక్షల ఆరోగ్య రక్షణను అందించనుంది.

## శ్రీహరిపురంలో ఎమ్మెల్యే గణబాబు మరియు జీవీఎంసీ కమిషనర్ విస్తృత పర్యటన



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** వచ్చే వర్షాకాలం దృశ్య వర్షపు వరదనీరుతో తరచుగా శ్రీహరిపురం గడ్డ పొంగుతుందని ముందస్తుగా చర్యలు చేపట్టే భాగంగా 60 వ వార్డు కొండపై నుంచి శ్రీహరిపురం మెయిన్ రోడ్డు నుంచి గుల్లలపాలెం 58వ వార్డు, కోరమండల్ నుంచి హెచ్పీసీఎల్ లోకి వెళ్లే గడ్డను ఆధునీకరించాలని జీవీఎంసీ కమిషనర్ శ్రీకాంత్ వర్మతో పాటు కలిసి పర్యటించి తనిఖీ చేశారు ఈ గడ్డ ముంపు వల్ల శ్రీహరిపురం గుల్లల పాలెం గ్రామం తరచూ ఇవన్నీ ఆ నీటి వల్ల విష జ్వరాలు సోకుతున్నాయని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అధికారులకు వివరించారు అదేవిధంగా త్వరలో ప్రారంభం కాబోయే అన్న క్యాంటీన్ నీ సందర్శించారు, మరియు శ్రీ హరి పురం బరేల్ గ్రౌండ్ లో

(మిగతా 2లో)

## కెజిహెచ్ అభివృద్ధికి మరింత కృషి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్రకే తలమానిక మైన కింగ్ జార్జ్ ఆసుపత్రి (కెజిహెచ్) లో మరిన్ని మెరుగైన సౌకర్యాలను అందించడానికి తమ వంతు కృషిచేస్తానని విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు సిహెచ్. వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. గురువారం ఉదయం కెజిహెచ్ లోని నవజాత శిశు తీవ్ర వ్యాధుల చికిత్స కేంద్రం ఎదురుగా రూ. 15 లక్షల ఆసుపత్రి అభివృద్ధి నిధులతో చేపట్టిన రోగుల సహాయకుల వేచి ఉండు గదిని శాసనసభ్యులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ముఖ్యంగా విశాఖపట్నానికే ఆయువు పట్టు కెజిహెచ్ అని కొనియాడారు. జిల్లావాసులే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి నిత్యం రోగులు ఇక్కడకు విచ్చేస్తుంటారని, ఇటువంటి ఆసుపత్రికి మరిన్ని వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా సుమారు 100 మంది రోగుల సహాయకులు వేచి ఉండేలా విశ్రాంతి గదిని నేడు ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు.ఈ గదికి అవసరమైన వాటర్ ప్లాంటును దాతల సహకారంతో త్వరలో ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రోగుల సహాయకులు వేచి ఉండేలా మరిన్ని గదులను నిర్మించేందుకు కృషిచేస్తామని పేర్కొన్నారు. వీటితో పాటు కెజిహెచ్ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడతామని శాసనసభ్యులు స్పష్టం చేశారు. తొలుత నవజాత శిశు తీవ్ర

(మిగతా 2లో)

## రామోజీరావుకు పుష్పాంజలి ఘటించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత రామోజీరావు సంస్మరణ సభకు పలువురు పాత్రికేయ, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. విజయవాడ శివారు కానూరులోని అనుమోలు గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రామోజీరావు కుటుంబ సభ్యులు, ప్రముఖ పాత్రికేయులు ఎన్.రామ్, శేఖర్ గుప్తా, గులాబ్ కొఠారి, రాష్ట్ర మంత్రులు, సినీ ప్రముఖులు హాజరై పుష్పాంజలి ఘటించారు. పత్రికా రంగంతోపాటు వివిధ రంగాల్లో రామోజీరావు అందించిన విశేష సేవలకు గుర్తింపుగా ఆయన సంస్మరణ సభను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. వేదిక వద్ద రామోజీరావు జీవిత విశేషాలతో ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను చంద్రబాబు, పవన్ కల్యాణ్ సహా ప్రముఖులు వీక్షించారు.

కృష్ణా జిల్లాలోని మారుమూల గ్రామం పెదపారుపూడిలో జన్మించిన రామోజీరావు.. అంచెలంచెలుగా ఎదిగారు. 'ఈనాడు'తోపాటు 'ఈటీవీ' ప్రసారాలతో మీడియాలో కొత్త ఒరవడి సృష్టించారు. ప్రకృతి విపత్తుల్లో ప్రజల వెన్నంటి నిలిచారు. 'మార్గదర్శి'తో మధ్యతరగతి ప్రజలకు పొదుపుపై అవగాహన కల్పించారు. సమాజాన్ని మేల్కొలిపే చిత్రాలను ఉషాకిరణ్ మూవీస్ ద్వారా అందించారు. ఆయన నిర్మించిన రామోజీ ఫిలింసిటీ గిన్నిస్ బుక్ రికార్డును సొంతం చేసుకుంది.

## ఎన్‌టీఏ ఆఫీసులోకి దూసుకెళ్లిన ఆందోళనకారులు.. దిల్లీలో ఉద్రిక్తత



దిల్లీ: యూజీసీ నెట్, నీట్ పీజీ వంటి పరీక్షల్లో ప్రశ్నపత్రం లీకేజీ, ఇతర అక్రమాలు చోటుచేసుకోవడంతో దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ ప్రవేశ పరీక్షలు నిర్వహించిన జాతీయ టెస్టింగ్ ఏజెన్సీపై పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా పలు విద్యార్థి సంఘాల నాయకులు దేశ రాజధాని దిల్లీలో ఆందోళన సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే వారిలో కొందరు గురువారం ఎన్‌టీఏ ఆఫీసులోకి దూసుకెళ్లడం గమనార్హం.

నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా-ఎన్ఎస్‌యూఐ సంఘానికి చెందిన దాదాపు 100 మంది ఆందోళనకారులు ఈ సాయంత్రం ఎన్‌టీఏ ఆఫీసు భవనంలోకి దూసుకెళ్లారు. అనంతరం వారు లోపలి నుంచి లాక్ చేసుకున్నట్లు సమాచారం. దీంతో ఎన్‌టీఏ ఆఫీసు వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆందోళనకారులు కార్యాలయం లోపలికి పరిగెడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

## కక్ష సాధింపు ఉంటే.. ఇంతకాలం ఆగుతామా?




**అమరావతి:** నాలుగు అంశాలను అజెండాగా పెట్టుకుని ముందుకు వెళ్తున్నామని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గంజాయి నిర్మూలన, మహిళలకు రక్షణ, పోలీసుల సంక్షేమం, పోలీసు శాఖలో నియామకాల భర్తీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. 'రెడ్ బుక్' కక్ష సాధింపు చర్యలకు కాదన్నారు. గత ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా పనిచేసిన అధికారులపై చట్టపరంగా చర్యలుంటాయని చెప్పారు. తమకు కక్ష సాధింపు ఉంటే.. ఇంతకాలం ఆగుతామా? అని వ్యాఖ్యానించారు. పగ, ప్రతీకారాల ఆలోచన చేయడం లేదని.. తమ నాయకుడు చంద్రబాబు చెప్పిన ప్రకారం రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తామని చెప్పారు. డీజీపీ, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు.

"ఈ 12 రోజుల్లో చాలా అంశాలను పరిశీలించా. వైకాపా ప్రభుత్వ హయాంలో పోలీసు వ్యవస్థను నాశనం చేశారు. కేవలం బందోబస్తుకే వాడారు. ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగం కూడా భర్తీ చేయలేదు. పోలీసు అకాడమీ, గ్రేహౌండ్ అకాడమీ లేదు. కేంద్రం నుంచి నిధులొచ్చినా పోలీసు అకాడమీ నిర్మాణం పూర్తిచేయలేదు. నేటికీ విశాఖపట్నం జిల్లాలోని ఓ పోలీస్‌స్టేషన్ రేకుల షెడ్డులోనే నడుస్తోంది. ఎస్కార్ట్ వాహనాలు కూడా పనిచేయడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. 2014లో ఇచ్చినవే ఇప్పటికీ వాడుతున్నారు. ఠాణాల్లో స్టేషనరీ ఖర్చులకు కూడా గత ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు.

గంజాయి రవాణా రాష్ట్రంలో బాగా పెరిగింది. నేషనల్ క్రైం రికార్డులో రాష్ట్రాన్ని మూడో స్థానంలోకి తెచ్చారు. గంజాయి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఇప్పటికే ఉపసంఘం ఏర్పాటు చేశాం. 100 రోజుల ప్రణాళిక ఏ విధంగా అమలు చేయాలనేదానిపై చర్చిస్తాం. ప్రజల భాగస్వామ్యంతోనే గంజాయిని అరికట్టేందుకు వీలుంటుంది. మంచి ఆలోచనతో పనిచేస్తే విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చు. ఎలాంటి శిక్షణ లేకుండా సచివాలయాల్లో మహిళా పోలీసులను పెట్టారు. ఏ విధంగా వారు పోలీసు విధులు చేయగలరు? వారిని ఏ విధంగా వినియోగించాలనేదానిపై ఆలోచన చేస్తున్నాం.

కలిసి కట్టుగా పనిచేసి పోలీసుల పనితీరులో మార్పు తెస్తాం. ప్రజలు ధైర్యంగా

(మిగతా 2లో)



(మొదటి పేజీ తరువాయిలు)

## జూలై 1 న ఇంటి వద్దే ఫించన్ల పంపిణీ

ఆదేశించారు. ఫించన్ల పంపిణిలో ప్రభుత్వానికి ఎటు వంటి మాట రాకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రాష్ట్ర గృహ నిర్మాణ, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ స్పెషల్ సిఎస్ అజయ్ జైన్, పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషణ్ కుమార్, ఆర్థిక శాఖ కార్యదర్శులు సౌరబ్ గౌర్, సత్యనారాయణ, గ్రామ వార్డు సచివాలయాల శాఖ సంచాలకులు శివప్రసాద్ తదితరులతోపాటు అన్ని జిల్లాల కలెక్టర్లు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

## శ్రీహరిపురంలో ఎమ్మెల్యే గణబాబు మరియు జీవీఎంసీ కమిషనర్ విస్తృత పర్యటన

జరగబోయే సుందరీకరణ పనులను అధికారుల తో సమీక్షించి లోపల అభివృద్ధి పనులు వివరాలను అడిగి తెలుసు కున్నారు బరేల్ గ్రౌండ్ బయట డెడ్ బాడీస్ ని నిలుపు స్థలాన్ని కాస్త పెంచమని సూచించారు కార్య క్రమంలో అధికారులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కెజిహెచ్ అభివృద్ధికి మరింత కృషి

వ్యాధుల చికిత్స కేంద్రం, నవజాత శిశు చికిత్స కేంద్రాన్ని ఆయన సందర్శించి, వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

కెజిహెచ్ సూపరింటెండెంట్ డా. పి.శివానంద్ మాట్లాడుతూ గతంలో నవజాత శిశు తీవ్ర వ్యాధుల చికిత్స కేంద్రంకు విచ్చేసే తల్లితండ్రులు, వారి సహాయకులు ఆసుపత్రి వెలుపల వేచి ఉండాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ఈ గదిని ప్రారంభించుకోవడం వలన సుమారు 100 మంది సహాయకులు వేచి ఉండేందుకు అవకాశం లభించిందని తెలిపారు. అంతేకాకుండా వార్డుకు ఎదురుగా ఈ గదిని నిర్మించడం వలన వైద్యులు పిలిచిన తక్షణమే తల్లి తండ్రులు హాజరయ్యేందుకు వీలు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. శాసన సభ్యుల సహకారంతో వాటర్ ప్లాంట్, మరిన్ని గదులను నిర్మిస్తామని వివరించారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.బుచ్చి రాజు,కెజిహెచ్ డెప్యూటీ సూపరింటెండెంట్ డా. వాణి, ఏపిఎంఎస్ఐడిసి కార్య నిర్వాహక ఇంజినీర్ డి.అచ్చంనాయుడు, ఏడి శ్రీనివాస్,ఇతర వైద్య సిబ్బంది, రోగుల సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కక్ష సాధింపు ఉంటే.. ఇంతకాలం ఆగుతామా?

స్టేషన్‌కు వెళ్లి బాధలు చెప్పుకొనేలా భరోసా ఇవ్వాలి. సిబ్బంది ప్రజలతో మర్యాదగా మెలగాలి. రాష్ట్రంలో ఆడపిల్లల అదృశ్యం ఘటనలు చాలా ఉన్నాయి. ఫిర్యాదులతో ఎవరైనా వస్తే వారిని కించపరిచేలా మాట్లాడవద్దు. పోలీసులు అంటే ప్రతిపక్ష పార్టీ నేతల అరెస్టులకే గత ప్రభుత్వం వినియోగించింది. ఇకపై ఫ్రెండ్లీ పోలీసింగ్ రావాలి. సోషల్ మీడియాలో నేటికీ నేను బాధితురాలినే. కొంతమంది ఐపీఎస్ అధికారుల తీరుతో వ్యవస్థకు చెడ్డపేరు వస్తోంది. గత ప్రభుత్వంలో అక్రమ కేసులు పెట్టారు. నాపైనే 23 కేసులు నమోదు చేశారు. అసభ్య పోస్టులపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. అక్రమ కేసులపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. పోలీసులంటే ప్రజల్లో ఒక నమ్మకం, గౌరవం తీసుకొస్తాం. ఏపీలో దిశ చట్టమే లేదు.. ఇక ఆ స్టేషన్ల పేరు కూడా మార్చే ఆలోచన చేస్తాం"అని హోం మంత్రి తెలిపారు.

## గుంజన్ కార్యక్రమంలో పాల్గొన్న కె.వి.శర్మ!




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గురువారం ఆకాశవాణి హిందీ గుంజన్ కార్యక్రమంలో నగరానికి చెందిన ప్రముఖ హిందీ పాత్రికేయులు,సామాజిక కార్య కర్త కెవి శర్మ పాల్గొని కవితలను అందించారు.

## రోడ్ ప్రమాదం లో తీవ్రగాయాలు అయిన వ్యక్తి మృతి



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** రోడ్ ప్రమాదం లో తీవ్ర గాయాలు పాలై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన వైనమిది. భీమిలి సి ఐ రమేష్ గురువారం వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమిలి జోన్ 4 వ డివిజన్ పరిధి కె గొల్లలపాలెం కు చెందిన చందక వెంకట రమణ(42) వృత్తి రీత్యా లారీ డ్రైవర్. అతనికి భార్య రమాదేవి, కుమారుడు మహిధర్(12), కుమార్తె దీక్ష (10) కలరు. పిల్లలు భీమిలి లో గల ట్యూషన్ కేంద్రం లో చదువుతున్నారు. అయితే ప్రతి రోజు వెంకట రమణ తన బైక్ పై భీమిలి వెళ్లి పిల్లలను తిరిగి ఇంటి నుండి తీసుకువస్తుంటాడు. ఈ క్రమం లో ఈ నెల 26 వ తేదీ( బుధవారం) పిల్లల కోసం ఇంటినుండి తన బైక్ పై బయలు దేరిన వెంకటరమణ ఉప్పాడ కూడలి వద్దకు వచ్చేసరికి రాంగ్ రూట్ లో ఎదురుగా అతి వేగం గా నిర్లక్ష్యం గా యమహా బైక్ పై వస్తున్న పోలా ప్రసంగి వెంకటరమణ ను బలం గా ఢీకొనడం తో కింద పడిపోయిన వెంకట రమణ కు చెవులు, ముక్కు ఇతర శరీర భాగలనుండి తీవ్ర రక్త స్రావం అయ్యింది. అక్కడే ఉన్న స్థానికులు సంఘటన స్థలం కు చేరుకొని అతన్ని 108 వాహనం ద్వారా గీతం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకట రమణ బుధవారం అర్థ రాత్రి సుమారు 2గంటల 20 నిమిషాల సమయం లో మృతి చెందాడు. మృతుని భార్య రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమిలి ఎస్ ఐ పైడి రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జూలై 1న ఇంటి వద్దే పింఛన్లు పంపిణీకి చర్యలు చేపట్టాలి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జూలై 1వ తేదీన ఉదయం నుంచి ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వెలగపూడి, ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం పింఛన్లు పంపిణీపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ కార్యాలయం లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఇన్ ఛార్జ్ జిల్లా కలెక్టర్ కె.మయూర్ అశోక్ భాగస్వామ్యం అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఎన్టీఆర్ భరోసా పథకం కింద జూలై 1వ



తేదీన పింఛన్ల పంపిణీ కోసం శనివారమే బ్యాంకుల ద్వారా నిధులు విత్ డ్రా చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పెంచిన పింఛనుతో పాటు ఎరియర్ తో కలిపి ఒక్కొక్కరికి రూ. 7వేలు చొప్పున 11 కేటగిరీలకు చెందిన పింఛను దారులకు ఇంటి వద్దనే అందజేయాలని సూచించారు. 1వ తేదీ ఉదయం 06.00గం.ల నుంచి సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ కావాలని, అదే రోజు సాయంత్రానికి బట్వాడా పూర్తికావాలని తెలిపారు. మిగిలిన వారు ఎవరైనా ఉంటే మరుసటి దినం పంపిణీ చేయాలని పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీలో అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పంపిణీ అనంతరం లబ్ధిదారుల నుంచి అక్నాలెడ్జ్మెంట్ తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహణాధికారి ఎం. పోలినాయుడు, డిఆర్డిఎ పథక సంచాలకులు శోభారాణి,డిఎల్డిఓ ఆర్. పూర్ణిమాదేవి, యుసిడి పథక సంచాలకులు ఎం.వి.డి ఫణిరామ్ , ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీ నిందితులను కఠినంగా శిక్షిస్తాం



నీట్ పేపర్ లీకేజీ అంశం దేశవ్యాప్తంగా ఎంతటి కలకలం సృష్టించిందో తెలిసిందే. ఈ అంశంపై పార్లమెంట్‌లో ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన సమయంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్పందించారు. నీట్ పేపర్ లీకేజీ నిందితులను కఠినంగా శిక్షిస్తామని అన్నారు. అలాగే ప్రభుత్వం న్యాయమైన విచారణకు కట్టుబడి ఉందని తెలిపారు. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరీక్షల ప్రక్రియను మరింత సమర్థంగా నిర్వహిస్తామని తెలిపారు.

"ఇటీవలి అవకతవకలు, పేపర్ లీక్‌లను దృష్టిలో పెట్టుకుని పరీక్షా విధానాన్ని మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది" అని ముర్ము చెప్పారు. ఇలాంటి సంఘటనలు (ప్రశ్న పత్రాలు లీక్) చాలా రాష్ట్రాల్లో జరిగాయని చెప్పిన రాష్ట్రపతి.. రాజకీయాలకు అతీతంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ద్రౌపదీ ముర్ము అన్నారు.

ఇదిలావుంటే, నీట్ పరీక్షలో రికార్డు స్థాయిలో 67 మందికి 720 మార్కులు రావడం, అందులోనూ ఒకే కోచింగ్ సెంటర్ నుంచి ఆరుగురికి ఇలా భారీగా మార్కులు స్కోర్ కావడంతో నీట్ పరీక్షపై లీకేజీ అనుమానాలు వెల్లువెత్తాయి. ఆ తర్వాత విచారణలో ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని తేలింది. 'సాల్వర్ గ్యాంగ్‌లు'గా పిలిచే క్రిమినల్ గ్యాంగ్‌లు ఇలా పేపర్ లీకేజీకి పాల్పడినట్లు తెలిసింది. దీంతో వారిని విచారించే బాధ్యతను ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది.

సీబీఐ విచారణలో భాగంగా ఇప్పటివరకు బీహార్, ఢిల్లీ, మహారాష్ట్ర నుండి పలువురిని అరెస్టు చేశారు. బీహార్ నుండి అరెస్టయిన నలుగురిలో అనురాగ్ యాదవ్, అతని స్నేహితులు పరీక్షకు 24 గంటల ముందు ప్రశ్నపత్రం కాపీలు అందుకున్నట్లు అంగీకరించారు. రాజస్థాన్‌లోని కోటాలోని కోచింగ్ సెంటర్‌లో ప్రిపేర్ అవుతున్న యాదవ్.. తన మామ సాయంతో ప్రశ్న పత్రం పొందినట్లు తెలిపాడు.

అరెస్టయిన వారిలో బీహార్‌కు చెందిన సనీవ్ ముఖియాను పోలీసులు ప్రధాన సూత్రధారుడిగా భావిస్తున్నారు. కాగా, మే 5న జరిగిన నీట్ పరీక్షకు దేశవ్యాప్తంగా దాదాపు 24 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇక నీట్ వివాదం చెలరేగడంతో ప్రభుత్వం యూజీసీ-నెట్ పరీక్ష ఫలితాలను రద్దు చేసిన విషయం తెలిసిందే.

# రైతులను ఆదుకొనే ప్రభుత్వాలు ఏర్పడడం శుభపరిణామం




**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** కేంద్రం లోను, రాష్ట్రం లోను రైతులను ఆదుకొనే ప్రభుత్వాలు ఏర్పడడం శు భ పరిణామం అని భీమిలి ఎం ఎల్ ఏ గంటా శ్రీనివాసరావు అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం లో భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాలకు చెందిన రైతులకు గురువారం ఖరీఫ్ సీజన్ కు గాను రాయితీ పై విత్తనాలనుఎం ఎల్ ఏ గంటా శ్రీనివాసరావు పంపిణి చేసారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ తాను భీమిలి ఎం ఎల్ ఏ గా గెలుపొందిన తరువాత మొట్ట మొదట అధికార కార్యక్రమం ఇదే అని ఆయన అన్నారు.దేశానికి వెన్నుముక రైతే అని ఆయన అన్నారు. అటువంటి రైతులను ఆదుకోంటేనే భవిష్యత్ బాగుంటుందని ఆయన అన్నారు.సాంకేతికం గా అభివృద్ధి లేని పూర్వ కాలం లో రైతులు అకాశం వైపు చూసి దుక్కి దున్ని పంటలను సాగు చేసేవారన్నారు. అయితే కాలం మారుతున్నకొలది అంతా సాంకేతక మయం అయిపోయిందని ఆయన అన్నారు. దురదృష్టవసాత్తు గత ప్రభుత్వాలు రైతులను ఆదుకోకపోవడం తో రైతులు వ్యవసాయం చేయలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని, అయితే ప్రస్తుతం ఇటు రాష్ట్రం లోను, అటు కేంద్రం లోను రైతులను ఆదుకొనే ప్రభుత్వాలు ఏర్పడడం వల్ల ఇక రైతులకు ఏ కష్టాలు ఉండవని ఆయన అన్నారు.కార్యక్రమం లో భీమిలి ఆర్ డి ఓ భాస్కర రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి డాక్టర్ వి జానకి, వ్యవసాయ శాఖ అధికారులు జడ్పీటీసీ గాడు వెంకటప్పడు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి వద్దనే పెన్షన్ ల పంపిణీకి ఏర్పాట్లు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి మండలం మొత్తం పెన్షనర్లు6191 పెరిగిన పెన్షన్ల నగదు మొత్తం రూ:4కోట్ల 11లక్షల 93 వేలు భీమిలి జోన్ లో మొత్తం పెన్షనర్లు8722 పెరిగిన నగదుమొత్తం రూ:5కోట్ల 97లక్షల 84 వేల 500 విశాఖ సమాచారం భీమునిపట్నం జూన్ 27: ఎన్నికల ప్రచారం లో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీ మేరకు పెన్షనర్లకుఏప్రిల్, మే, జూన్ నెలల్లో 1000 రూపాయిలు పంతున్న జులై నెల నుండి 4 వేల రూపాయిలు మొత్తం 7 వేల రూపాయిల మేర కూటమి ప్రభుత్వం పెన్షన్ పంపిణీకి నిర్ణయం తీసుకొంది. జులై 1 న సచివాలయ సిబ్బంది,అవసరమైతే ఇతరప్రభుత్వ కార్యాలయాల సిబ్బందితో పెన్షన్ లు పంపిణీకి చర్యలు చేపట్టినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి డాక్టర్ వి జానకి , యూసిడి విభాగం భీమిలి జోన్ ఏపిడి సంతోష్ లు తెలిపారు.

**భీమిలి మండలం :** భీమిలి మండలం లో మొత్తం 6191 మంది పెన్షనర్లకు గాను మొత్తం 4కోట్ల 11లక్షల 93 వేల రూపాయిలను పెన్షన్ రూపేణా చెల్లించనున్నారు. వీటిలో అమానం గ్రామం లో :428 పెన్షనర్లకు రూ : 28 లక్షల 53 వేలు, అన్నవరం :427 మందికి రూ :29 లక్షల 10 వేల 500 లు, చిప్పాడ :600 మందికి రూ :40 లక్షల 85 వేలు, దాకమర్రి :522 మందికి రూ :35లక్షల 49 వేల 500లు, లక్ష్మీపురం : 410 మందికి రూ :26 లక్షల 83 వేలు, మజ్జిపేట : 299 మందికి రూ :19 లక్షల 54 వేల 500లు, మజ్జివలస :246 మందికి రూ :16 లక్షల 55 వేలు, మూలకుద్దు :660 మందికి రూ :42లక్షల 81 వేలు, పెదనాగమయ్యపాలెం:656 మందికి రూ :44లక్షల 71 వేల 500లు, సింగనబంద :372 మందికి రూ :24లక్షల 74 వేలు, టి నగరపాలెం :322 మందికి రూ :21 లక్షల 51 వేల 500లు, తాళ్ళవలస :658 మందికి రూ :42 లక్షల 45 వేల 500లు, తాటితూరు : 591 మందికి రూ : 38 లక్షల 79 వేలు. మండలం లో మొత్తం 6191 మంది పెన్షనర్లకుజులై నెలకు గాను రూ : 4కోట్ల 11 లక్షల 93 వేల రూపాయిలను అందజేయనున్నామని మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి డాక్టర్ వి జానకి వివరించారు.

**భీమిలి జోన్:** భీమిలి జోన్ లో గల 4 డివిజన్ ల పరిధిలో మొత్తం 8722 మంది పెన్షన్ దారులకు జులై నెలకు గాను 5 కోట్ల 97లక్షల 84వేల 500 రూపాయిలను అందజేయనున్నట్లు జీవీఎంసీ యూసిడి విభాగం భీమిలి జోన్ సహాయ ప్రాజెక్ట్ అధికారి సంతోష్ తెలిపారు. 1 వ డివిజన్ :2227 మంది పెన్షనర్లకు రూ :1కోటి 53లక్షల 58 వేల 500లు, 2 వ డివిజన్ : 2002మందికి రూ : 1కోటి 36 లక్షల 90 వేలు, 3 వ డివిజన్ :1986 మందికి రూ : 1కోటి 36లక్షల 94 వేల 500లు, 5 వ డివిజన్ : 2507 మందికి రూ : 1కోటి 70లక్షల 41వేల 500లు. భీమిలి జోన్ లో మొత్తం 8722 మంది పెన్షన్ దారులకు రూ :5 కోట్ల 97 లక్షల 84 వేల 500 లు పంపిణీ చేయనున్నట్లు యూసిడి ఏపిడి సంతోష్ వివరించారు.

**పంచాంగం**

శుక్రవారం 28-06-2024
క్రోధి నామ సంవత్సరము
ఉత్తరాయణం, గ్రీష్మఋతువు
జ్యేష్ఠమాసం

| | |
|---|---|
| తిథి | : బ. సప్తమి సా. 06.05 |
| నక్షత్రం | : పూర్వాభాద్ర ప. 12.36 |
| వర్జ్యం | : రా. 09.32 ల 11.00 |

## 29న జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఈ నెల 29వ తేదీన జిల్లా పరిషత్ ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి ఎం.పోలినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో 29వ తేదీ ఉదయం 10.00గం.ల నుంచి మధ్యాహ్నం 12.00 గం.ల వరకు ఒకటి నుంచి ఏడో స్థాయీ సంఘాల సమావేశాలు జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ జె. సుభద్ర అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.00 గం.లకు రెండు, ఐదో స్థాయీ సంఘాల సమావేశాలు, ఉదయం 11.00 గం.లకు నాలుగు, మూడో స్థాయీ సంఘ సమావేశాలు, అదే విధంగా మధ్యాహ్నం 12.00 గం.లకు ఒకటి , ఆరు, ఏడో స్థాయీ సంఘ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో సభ్యులందరూ హాజరు కావలసిందిగా ఆయన కోరారు.

## మత్స్యకారులకు అవగాహన




**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి మండలం ఉప్పాడ వద్ద గల మత్స్య శాఖఅభివృద్ధి అధికారి కార్యాలయం లో మత్స్యకారులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించబడినది. భారతీయ మత్స్య పరిశోధన సంస్థ, జిల్లా మత్స్యశాఖ సహకారం తో జరిగిన కార్యక్రమం లోపాల్గొన్న డి బామిరెడ్డి( ఎంఎంఈ, హెచ్ఓఓ, ఎఫ్ఎస్ఐ) మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను, నిరూపయోగమైన వలలను సముద్రం లో వదలి వేయడం వల్ల సముద్ర జీవారసులకు కలిగే ప్రాణ నష్టం, అలాగే మత్స్యకారులకు కూడా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని మత్స్యకారులకు తెలియజేసారు. ఎఫ్ ఎస్ ఐ జీవివి ప్రసాద్ మాట్లాడుతూ తాబేళ్లను వేటాడడం నేరం అని కావున తాబేల్లా సంరక్షణకు టెడ్ ను ఉపయోగించాలని కోరారు. మత్స్య శాఖ అధికారులు ఆర్ ఈశ్వరరాజు, డి లావణ్య లు మాట్లాడుతూ సముద్ర జీవాల పరిరక్షణ, మత్స్య సంపద పెంపుదలకు భీమిలి తీర ప్రాంతం లో చేపల కృత్రిమ ఆవాస కేంద్రాల ఏర్పాటునకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని వారు అన్నారు. ముందుగా మత్స్యకారులతో వివిధ ప్రాంతాలలో ర్యాలీ నిర్వహించబడినది.కార్యక్రమం లో మత్స్యకార పెద్దలు మారుపల్లి అమరనాధ్, కారి చిట్టెమ్మ, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ షాప్ లో చోరీ

40 వేల రూపాయిలు తస్కరణ




**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** స్థానిక తగరపు వలస కూడలి వద్ద( భీమిలి రోడ్) గల ప్రభ మెడికల్ షాపు లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగి సుమారు 40 వేల రూపాయిలు తస్కరణకు గురయ్యింది. వివరాలు ఇలా ఉన్నాయి. నిత్యం రద్దీ గా ఉండే భీమిలి రోడ్ లో గల ప్రభ మెడికల్ షాపు యజమాని కిషోర్ ఎప్పటిలాగానే బుధవారం రాత్రి షాపు మూసివేసి ఇంటికి వెళ్ళిపోయాడు. గురువారం ఉదయం షాప్ నకు వచ్చి షాప్ తెరిచి చూస్తే షాప్ లో మందులు చెల్లా చెదురుగా పడి ఉండి, షాప్ పై రేకులకు రంధ్రాలు పెట్టి ఉండడాన్ని గమనించాడు. అలాగే లాకర్ పెట్టిన 40 వేల రూపాయిలు కూడా లేకపోవడాన్ని గమనించిన షాప్ యజమాని కిషోర్ నిర్ఘాంత పోయాడు. ఇది ఎవరో దొంగలు చేసిన పని అని నిర్ధారించుకొని గురువారం భీమిలి పోలీస్ లకు ఫిర్యాదు చేసారు. వెంటనే స్పందించిన నేరవిభాగం ఎస్ ఐ సూర్య ప్రకాష్ సంఘటన జరిగిన షాప్ వద్దకు వచ్చి పరశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విశాఖ సమాచారమ్

శుక్రవారం 28-06-2024


## తెలుగు సంవత్సరాల పేర్లు... వాటి అర్థాలు

1. ప్రభవ అంటే... ప్రభవించునది... అంటే... పుట్టుక.
2. విభవ - వైభవంగా ఉండేది.
3. శుక్ల... అంటే తెల్లనిది. నిర్మలత్వం, కీర్తి, ఆనందాలకు ప్రతీక.
4. ప్రమోదూత.... ఆనందం. ప్రమోదభరితంగా ఉండేది ప్రమోదూత.
5. ప్రజోత్పత్తి... ప్రజ అంటే సంతానం. సంతాన వృద్ధి కలిగినది ప్రజోత్పత్తి.
6. అంగీరస... అంగీరసం అంటే శరీర అంగాల్లోని ప్రాణశక్తి, ప్రాణదేవుడే అంగీరసుడు. ఆ దేవుడి పేరు మీదే ఈ పేరొచ్చింది అని అర్థం.
7. శ్రీముఖ... శుభమైన ముఖం. ముఖం ప్రధానాంశం కాబట్టి అంతా శుభంగా ఉండేదనే అర్థం.
8. భావ.... భావ అంటే భావ రూపుడిగా ఉన్న నారాయణుడు. ఈయనే భావ నారాయణుడు. ఈయన ఎవరని విశ్లేషిస్తే సృష్టికి ముందు సంకల్పం చేసే బ్రహ్మ అని పండితులు వివరిస్తున్నారు.
9. యువ.... యువ అనేది బలానికి ప్రతీక.
10. ధాత... అంటే బ్రహ్మ. అలాగే ధరించేవాడు, రక్షించేవాడు.
11. ఈశ్వర... పరమేశ్వరుడు.
12. బహుధాన్య... సుభిక్షంగా ఉండటం.
13. ప్రమాది... ప్రమాదమున్నవాడు అని అర్థమున్నప్పటికీ సంవత్సరమంతా ప్రమాదాలు జరుగుతాయని భయపడనవసరం లేదు.
14. విక్రమ... విక్రమం కలిగిన వాడు.
15. వృష ... చర్మం.
16. చిత్రభాను... భానుడంటే సూర్యుడు. సూర్యుడి ప్రధాన లక్షణం ప్రకాశించటం. చిత్రమైన ప్రకాశమంటే మంచి గుర్తింపు పొందడమని అర్థం.
17. స్వభాను... స్వయం ప్రకాశానికి గుర్తు. స్వశక్తి మీద పైకెదిగేవాడని అర్థం
18. తారణ... తరింపచేయడం అంటే దాటించడం. కష్టాలు దాటించడం, గట్టెక్కించడం అని అర్థం.
19. పార్థివ... పృథ్వీ సంబంధమైనది, గుర్రం అనే అర్థాలున్నాయి.

భూమికున్నంత సహనం, పనిచేసేవాడని అర్థం.

20. వ్యయ... ఖర్చు కావటం. ఈ ఖర్చు శుభాల కోసం ఖర్చై ఉంటుందని ఈ సంవత్సరం అర్థం.
21. సర్వజిత్తు.... సర్వాన్ని జయించినది.
22. సర్వధారి -...సర్వాన్ని ధరించేది.
23.విరోధి.... విరోధం కలిగినట్టువంటిది.
24. వికృతి... వికృతమైనటువంటిది.
25. ఖర.... గాడిద, కాకి, ఒక రాక్షసుడు, వాడి, వేడి, ఎండిన పొక అనే అర్థాలున్నాయి.
26. నందన ... కూతురు, ఉద్యానవనం, ఆనందాన్ని కలుగజేసేది.
27. విజయ... విశేషమైన జయం కలిగినది.
28. జయ.... జయాన్ని కలిగించేది.
29. మన్మథ... మనస్సును మథించేది.
30. దుర్ముఖి... చెడ్డ ముఖం కలది.
31. హేవిలంబి... సమ్మోహన పూర్వకంగా విలంబి చేసేవాడని అర్థం.
32. విలంబి... సాగదీయడం.
33. వికారి.... వికారం కలిగినది.
34. శార్వరి... రాత్రి.
35. ప్లవ... తెప్ప. కప్ప, జువ్వి... దాటించునది అని అర్థం.
36. శుభకృత్... శుభాన్ని చేసి పెట్టేది.
37. శోభకృత్... శోభను కలిగించేది.
38. క్రోధి... క్రోధాన్ని కలిగినది.
39. విశ్వావసు... విశ్వానికి సంబంధించినది.
40. పరాభవ ... అవమానం.
41. ప్లవంగ... కోతి, కప్ప. దాటించునది
42. కీలక.... పశువులను కట్టేందుకు ఉపయోగించే కొయ్య.
43. సౌమ్య... మృదుత్వం.
44. సాధారణ... సామాన్యం.
45. విరోధికృత్... విరోధాలను కలిగించేది.
46. పరీధావి... భయకారకం.
47. ప్రమాదీచ... ప్రమాద కారకం.
48. ఆనంద... ఆనందమయం.
49. రాక్షస... రాక్షసత్వాన్ని కలిగినది.
50. నల.... నల్ల అనే పదానికి రూపాంతరం.
51. పింగళ... ఒక నాడి, కోతి, పాము, ముంగిస.
52. కాలయుక్తి... కాలానికి తగిన యుక్తి.
53. సిద్ధార్థి... కోర్కెలు సిద్ధించినది.
54. రౌద్రి... రౌద్రంగా ఉండేది.
55. దుర్మతి... దుష్ట బుద్ధి.
56. దుందుభి ... వరుణుడు.
57. రుధిరోద్గారి... రక్తాన్ని స్రవింప చేసేది.
58. రక్తాక్షి... ఎర్రని కన్నులు కలది.
59. క్రోధన... కోప స్వభావం కలది.
60. అక్షయ... నశించనిది.

# ప్రజలకు నాణ్యమైన సేవలందించడమే లక్ష్యం



**పాడేరు. (విశాఖ సమాచారమ్):** జిల్లాలో ప్రజలకు నాణ్యమైన సేవలందించడమే అధికారుల లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎ .ఎస్. దినేష్ కుమార్ దిశానిర్దేశం చేసారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించి నిర్లక్ష్యంగా వ్యవహిస్తే ఉపేక్షించనని అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశ మయ్యారు. చింతూరు, రంపచోడవరం డివిజన్ల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాపై పూర్తి అవగాహన ఉందన్నారు. అధికారుల విధులు బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలని అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించనని చెప్పారు. జిల్లా అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని జాప్యం లేకుండా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. గ్రామ సచివాలయం సిబ్బందితో జిల్లా అధికారులు సమావేశాలు నిర్వహించి సమర్థవంతంగా పని చేయాలని చెప్పారు. ఉపాధిహామీ పనులు ముమ్మరంగా జరగాలని తెలియ జేసారు. విద్య, వైద్య ఆరోగ్య సేవలు, దోమల మందు పిచికారీ పనులు పక్కాగా నిర్వహించాలని చెప్పారు. విద్యాలయాల్లో పకడ్బందీగా పాఠ్య ప్రణాళికలు అమలు చేయాలని ఆదేశించారు.

ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తామన్నారు. ఏడాది పదిలో ఉత్తమ ఫలితాలు సాధించారని అన్నారు. సామర్థ్యాలు మరింత మెరుగు పడాలని, ఎక్కడా విద్యార్థుల చూచిరాతలు జరగకూడదన్నారు. దోమల నివారణ మందు రెండవ విడత పిచికారీ పనులు ప్రారంభించాలని సూచించారు. స్ప్రేయింగ్ పక్కాగా జరగాలన్నారు. వైద్య సిబ్బంది, వి. ఆర్. ఓలు, అంగన్వాడీ వర్కర్ల సమన్వయంతో స్థానిక సర్పంచులు భాగస్వామ్యంతో పిచికారీ పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ పనులపై ప్రత్యేకంగా సమీక్షిస్తామని చెప్పారు. రంపచోడవరంలో సోమవారం, చింతూరులో బుధవారం,పాడేరులో శుక్రవారం మీకోసం ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని అమలు చేసి ప్రజల నుండి వినతులు స్వీకరిస్తామన్నారు. ఫిర్యాదులను ఆన్లైన్లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాలో ముమ్మరంగా ఉపాధిహామీ పనులు చేపట్టాలని ఉపాధి హామీ అధికారులను ఆదేశించారు. ఉపాధి కూలీల చెల్లింపుల్లో ఎటువంటి జాప్యం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఉపాధిహామీ పథకం అమలులో అనవసర సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపిడి ఓలు నిరంతరం ఉపాధి హామీ పనులను పర్యవేక్షించాలని చెప్పారు. తుఫాను వరద ప్రభావిత ప్రాంతాలలో పునరావాస చర్యలు చేపట్టడానికి అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. గ్రామాలలో పారిశద్ధ్యం పనులు చేయాల ని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ఠ, రంప చోడవరం ఐటిడిఏ పి ఓ సూరజ్ గనోరే సబ్ కలెక్టర్, పాడేరు సబ్ కలెక్టర్ పి. ధాత్రి రెడ్డి, ఎస్. ప్రశాంత్ కుమార్ చింతూరు ఆర్ డి ఓ చైతన్య, డి. ఆర్. ఓ బి. పద్మావతి, ఎస్ డిసిలు వి. వి. ఎస్. శర్మ, భవాని, గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇ డి.వి. ఆర్. ఎం. రాజు, డి.ఆర్.డి. ఏ.పి.డి. మురళి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ భాషా, డి. హెచ్. ఓ రమేష్ కుమార్ రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్ .నంద్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకలు ఐ. కొండలరావు, పలువురు జిల్లా అధికారులు, ఎంపిడి ఓలు, తాహశీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక రైళ్ల సేవల పొడిగింపు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం - సికింద్రాబాద్ & విశాఖపట్నం - తిరుపతి మధ్య ప్రయాణీకులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి, ఈస్ట్ కోస్ట్ రైల్వే దిగువ వివరించిన విధంగా వారానికో ప్రత్యేక రైళ్లను కొనసాగించాలని నిర్ణయించింది.

ఎ. విశాఖపట్నం-సికింద్రాబాద్-విశాఖపట్నం స్పెషల్ (08579/08580)

1. రైలు నెం. 08579 విశాఖపట్నం-సికింద్రాబాద్ వీక్లీ స్పెషల్ రైలు బుధవారం నాడు 03.07.2024 నుండి 28.08.2024 వరకు విశాఖపట్నం నుండి 19.00 గంటలకు బయలుదేరుతుంది, ఇది మరుసటి రోజు 08.20 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. (09 పర్యటనలు)

2. తిరుగు దిశలో రైలు నెం.08580 సికింద్రాబాద్-విశాఖపట్నం వీక్లీ స్పెషల్ రైలు గురువారం నాడు 04.07.2024 నుండి 29.08.2024 వరకు 19.40 గంటలకు సికింద్రాబాద్ నుండి బయలుదేరి మరుసటి రోజు 06.40 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. (09 పర్యటనలు)

స్టాపేజ్‌లు: విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య దువ్వాడ, అనకాపల్లి, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లె, మిర్యాలగూడ, నల్గొండ.

బి. విశాఖపట్నం-తిరుపతి-విశాఖపట్నం స్పెషల్ (08583/08584)

1. రైలు నెం. 08583 విశాఖపట్నం-తిరుపతి వీక్లీ స్పెషల్ రైలు 01.07.2024 నుండి 26.08.2024 వరకు సోమవారాల్లో 19.00 గంటలకు విశాఖపట్నం నుండి బయలుదేరి మరుసటి రోజు 09.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. (09 పర్యటనలు)

2. తిరుగు దిశలో రైలు నెం. 08584 తిరుపతి-విశాఖపట్నం వీక్లీ స్పెషల్ మంగళవారం 02.07.2024 నుండి 27.08.2024 వరకు 21.55 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు 10.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. (09 పర్యటనలు)

స్టాప్‌లు: విశాఖపట్నం-తిరుపతి మధ్య దువ్వాడ, అనకాపల్లి, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లి గూడెం, ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట

బి. న్యూ టిన్సుకియా-ఎస్ఎంవి బెంగళూరు - న్యూ టిన్సుకియా (05952/05951)

1. రైలు నెం. 05952 న్యూ టిన్సుకియా- ఎస్ఎంవిటి బెంగళూరు ప్రత్యేక రైలు గురువారం నాడు 04.07.2024 నుండి 31.10.2024 వరకు 18:45 గంటలకు న్యూ టిన్సుకియా నుండి బయలు దేరుతుంది, ఇది మూడవ రోజు 13:50 గంటలకు విశాఖపట్నం చేరుకుని 4:10 గంటలకు బయలుదేరుతుంది. ఎస్ఎంవి బెంగళూరు 09:00 గంటలకు చేరుకుంటుంది (18 ట్రిప్పులు)


2. తిరుగు దిశలో రైలు నెం. 05951 ఎస్ఎంవి బెంగళూరు -న్యూ టిన్సుకియా ప్రత్యేక రైలు ఎస్ఎంవి బెంగళూరు నుండి సోమవారం నాడు 08.07.2024 నుండి 04.11.2024 వరకు 00:30 గంటలకు (ఆదివారాలు అర్ధరాత్రి) బయలుదేరుతుంది, అదే రోజు 21: విశాఖపట్నం చేరుకుంటుంది. 40 గంటలు & 22:00 గంటలకు బయలుదేరి బుధవారం 13:15 గంటలకు న్యూ టిన్సుకియా చేరుకుంటుంది. (18 పర్యటనలు)

స్టాప్‌లు: ఈస్ట్ కోస్ట్ రైల్వే దువ్వాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్‌లలో ప్రత్యేక రైళ్ల క్రింది స్టాప్‌లను కలిగి ఉన్నాయి.

ప్రయాణీకులు ఈ ప్రత్యేక రైళ్లను వినియోగించుకోవాలని కోరారు.

# పెండింగ్ పనుల పూర్తికి యాక్షన్ ప్లాన్ తయారు చేయండి

విజయనగరం, జూన్ 27: జిల్లాలో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చేపట్టిన రహదారి పనులు ఏయే స్కీంల క్రింద ఏ మేరకు పూర్తయ్యాయి, ఎంత పెండింగ్ ఉన్నాయి, నిధుల లభ్యత, పెండింగ్ బిల్లుల వివరాల పై కలెక్టర్ డా॥ బి.ఆర్.అంబేద్కర్ ఆరా తీశారు. గురువారం ఆయన ఛాంబర్‌లో పలు శాఖల ద్వారా చేపడుతున్న పనుల పై సమీక్షించారు. పంచాయతీ రాజ్ ద్వారా ఎన్ని రహదారి పనులు జరుగుతున్నాయి, ప్రస్తుతం ఏయే స్థాయి లో ఉన్నాయని ఆ శాఖ ఇంజినీర్లను అడిగారు. నిర్దేశిత అగ్రిమెంట్ గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. మిగిలిన వాటికి నియోజకవర్గం వారీగా అంచనాలను తయారు చేసి వాటిని పూర్తి చేయడానికి ఏక్షన్ ప్లాన్ కూడా తయారు చేసి వచ్చే సమావేశంలోగా



ఇవ్వాలన్నారు.

జిల్లా పంచాయతీ శాఖ సమీక్ష లో భాగంగా చెత్త సేకరణ ఇక జరుగుతోందని డి పి ఓ శ్రీధర్ రాజాను ప్రశ్నించారు. ప్రస్తుతం 200 పంచాయతీలలో మాత్రమే ఇంటింటి చెత్త సేకరణ జరుగుతోందని డి పి ఓ తెలుపగ 15 రోజుల గడువులో జిల్లాలోని అన్ని పంచాయతీలలో ఇంటింటి చెత్త సేకరణ జరగాలని ఆదేశించారు.

గ్రామీణ నీటి సరఫరా శాఖ చేస్తున్న పనుల పై ఆరా తీశారు. ప్రస్తుతం జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి వేసే కార్యక్రమం నడుస్తున్నదని ఎస్.ఈ ఉమ శంకర్ తెలిపారు. 3లక్షల 97 వేల గృహాలకు కుళాయిలు లక్ష్యం కాగా 1 లక్ష 72 వేలా గృహాలకు కుళాయిలు వేయడం జరిగిందని ఎస్.ఈ వివరించారు. శత శాతం లక్ష్యాలను పూర్తి చేయడానికి ఏక్షన్ ప్లాన్ తయారు చేసి వెంటనే ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

## దూరవిద్యాకేంద్రం డైరెక్టర్‌గా డా.ఎన్.విజయమోహన్ నియామకం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** డా.ఎన్.విజయ మోహన్‌ను దూరవిద్యాకేంద్రం డైరెక్టర్‌గా నియమితులైనందుకు గాను సమతా కళాశాల డీన్ డా. విజయరవీంద్ర మరియు కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డా. జి.శ్రీనివాసరావు మరియు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జి.రామకృష్ణ మరియు కళాశాల సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

## ఏపీలో డయేరియా.. డేంజర్ బెల్స్.. చికెన్, మటన్ అమ్మకాలు బంద్



ఆంధ్రప్రదేశ్‌లో డయేరియా డేంజర్ బెల్స్ మోగిస్తోంది. జగ్గయ్యపేటను మంచాన పడేసింది. భారీ సంఖ్యలో బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గత నాలుగు రోజుల్లో వందల మంది డయేరియా బారినపడ్డారు. బాధిత ప్రాంతాల్లో అధికారులు యుద్ధప్రాతిపదికన రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టారు. గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలలో వాంతులు విరోచనాలతో పలువురు చికిత్స పొందుతున్నారు. జగ్గయ్యపేట రూరల్‌లో పరిస్థితి కొంత కంట్రోల్‌లోకి వచ్చినా.. పట్టణంలో కేసులు పెరుగుతున్నాయి. జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులకు చికిత్స అందించారు. ట్రీట్మెంట్ తర్వాత కొందరు డిశ్చార్జ్ కాగా.. మరికొందరు డయేరియాతో ఆస్పత్రిలో చేరారు. ఏపీ వైద్య శాఖమంత్రి సత్యకుమార్ రాకతో అలర్టైన అధికారులు.. డయేరియా ప్రబలుతున్న ప్రాంతాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

## శ్రీ నూకాంబిక అమ్మవారి హుండీ ఆదాయం 50 లక్షల ఒక వెయ్యి 327 రూపాయలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అయిన అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి హుండీ ద్వారా ఆదాయం 50 లక్షల ఒకవేయి 325 రూపాయలు లభించిందని ఆలయ కార్య నిర్వహణ అధికారి బండారు ప్రసాద్ తెలిపారు. భక్తుల ముడుపులు మొక్కుబడుల ద్వారా మే 7వ తేదీ నుండి జూన్ 27వ తేదీ వరకు హుండీ ద్వారా ఆదాయం లభించినట్టు ఆయన తెలిపారు. అలాగే 30 గ్రాముల బంగారం ఒక కేజీ 200 గ్రాముల వెండి లభించిందన్నారు. ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్ దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదార్ ఎం శ్రీధర్ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. ఆలయ సిబ్బంది అర్చకులు శ్రీవారి సేవకులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవరపాలెం బ్రాంచ్ అధికారులు తదితరులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## "ఉభయ తెలుగు రాష్ట్రాల పాలకులారా"

పాలకులకు ప్రజల నాడేమీటో నేడు తెలిసింది. నేటి 2024 ఎన్నికల తో కనువిప్పు కలుగ చేసారు.

కేంద్రంలోనైనా రాష్ట్రాలలోనైనా ఓటరు తీర్పు విదితం. విజ్ఞత తో ఓటు వేసి అధికారం కట్టబెట్టి అక్రమార్కులను ప్రక్కన పెట్టారు.

రాజకీయాలలో ఓటరు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాడుఅని చెప్పవచ్చు. ఇక నుంచి పాలకుల పాచికలు సాగవు అని హెచ్చరిక చేసాడు.

వళ్ళు దగ్గర పెట్టుకుని పాలన కొన సాగించక పోతే తిరిగి అధికారం కోల్పోయే ప్రమాదం ఉందనిప్రస్తుత పాలకులు గ్రహించాలి. కావున గత ప్రభుత్వం చేసిన తప్పులనే తిరిగి నేడు చేయక, కక్ష సాధింపులకు రాంధ్రాన్వేషణలకు స్వస్తి పలికి పాలన సాగించాలి లేనిచో, గత పాలకులకు, ప్రభుత్వాలకు పట్టిన గతే మీకూ పడుతుంది అని గ్రహించండి.

ఓర్పు, నేర్పుతో పాలన చేయండి, అభివృద్ధికి బాటలు వేయండి. సంక్షేమం తో పాటుసు పరిపాలనకు శ్రీకారం చుట్టండి. ఓటు బ్యాంకు రాజకీయాలకు స్వస్తి పలకండి. అవినీతికి తావివ్వకండి, పాలన పారదర్శకంగా ఉండేటట్లు చూడండి.

నూతన పరిశ్రమలను స్వాగతించండి, ఉపాధి అవకాశాలను మెరుగు పరచండి. ఉచితం అనుచితం అని గ్రహించండి, ప్రజలను సోమరి పోతులుగా తీర్చిదిద్దకండి. మద్యం దుకాణాలను క్రమబద్ధీకరించండి అప్పుడే తిరిగి అధికారం మీ హస్తగతం చేసుకోవడం సులువు అవుతుంది అని గ్రహించండి.



డా. నండూరి రామక్రిష్ణ

## ఈ ఆకు వేసి అన్నం వండితే బిర్యానీలా ఉంటుందట



సాధారణంగా పులావ్, బిర్యానీ చేసేటప్పుడు కొన్ని ఎక్స్‌ట్రా మసాలాలు యాడ్ చేస్తాం. కొన్ని బిర్యానీ మసాలాలని అన్నంలో వేస్తాం. ఇవి మామూలు అన్నానికి మరింత రుచిని తీసుకొస్తాయి. అవన్నీ ప్రతిసారి వేయలేం కానీ, బిర్యానీ ఆకు అయితే వేయొచ్చుగా. అవును బిర్యానీ ఆకు అన్నం ఉడికేటప్పుడు వేసి చూడండి. మామూలు అన్నం కంటే రుచి అమాంతం పెరుగుతుంది. దీనిని వేయడం వల్ల రుచి మాత్రమే కాదు. ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు నిపుణులు. ఇందులో బిర్యానీ ఆకులోని గొప్ప గుణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

సాధారణంగా బిర్యానీ ఆకులో విటమిన్ ఎ, బి6, విటమిన్ సి వంటి ముఖ్య పోషకాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా ఇమ్యూనిటీని పెంచి జీవక్రియను మెరుగు చేస్తాయి. ఇందులోని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఇన్ఫెక్షన్లు, అలెర్జీలను తగ్గిస్తాయి. డిజిటల్ జర్నల్ వెబ్ ఎమ్‌డిలో ప్రచురించిన ఓ అధ్యయనం ప్రకారం, బిర్యానీ ఆకుల్లో స్టెఫిలోకాకస్ ఆరియస్, ఇ కోలి వంటి బ్యాక్టీరియాను దూరం చేసే గుణాలు ఉంటాయి. దీంతో ఎన్నో సమస్యలు దూరమవుతాయి. అంతేకాకుండా, బిర్యానీ ఆకుల్లో అల్సర్, క్యాన్సర్‌కి కారణమయ్యే బ్యాక్టీరియా హెచ్‌పైలోరితో కూడా పోరాడే గుణాలు ఉన్నాయని తెలిపింది. అంతే కాదండోయ్ వీటిలో గుణాలు ఒత్తిడి, ఆందోళనను కూడా దూరం చేస్తాయి.

**ఎలా వేయాలి..** మనం అన్నం ఉడికించేటప్పుడు కుక్కర్ అయినా, గిన్నెలో అయినా బిర్యానీ ఆకులను వేయాలి. అన్నం ఉడికాక ఈ ఆకుని తీసేయొచ్చు. బిర్యానీ చేసేటప్పుడు మామూలుగా ఎలాగూ మసాలా వేసే టైమ్‌లోనే ఇది వేస్తాం కదా. ఈ ఆకు వేయడం వల్ల రుచి వస్తుంది. నార్మల్‌గా అన్నం వండేటప్పుడు క్వాంటిటీని బట్టి ఒకటి, రెండు వేస్తే సరిపోతుంది. ఇలా చేయడం వల్ల ప్లేయిన్ రైస్ కూడా బిర్యానీ ఫ్లేవర్‌తో రుచి, వాసనతో నోరూరిస్తుంది.

# పిల్లల్లో ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా?



చైల్డ్ హుడ్ లుకేమియా: లుకేమియా (బ్లడ్ క్యాన్సర్) అనేది ప్రపంచవ్యాప్తంగా యుక్తవయస్కులు, పిల్లలలో సర్వసాధారణమైన క్యాన్సర్. ప్రారంభ రోగ నిర్ధారణ, సకాలంలో చికిత్స చాలా ముఖ్యం అయినప్పటికీ, పెద్దల కంటే పిల్లలు ప్రారంభ చికిత్సకు సానుకూలంగా స్పందిస్తారని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అసలు ఈ బ్లడ్ క్యాన్సర్ అంటే ఏమిటి..? బ్లడ్ క్యాన్సర్ శరీరాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది? అన్న అంశాలపై ఇంటర్నేషనల్ క్యాన్సర్ ఆర్గనైజేషన్ నిర్వహించిన అధ్యయనం ప్రకారం.. లుకేమియా అనేది తెల్ల రక్త కణాలను ప్రభావితం చేసే క్యాన్సర్. మన శరీర రోగనిరోధక వ్యవస్థలో తెల్ల రక్తకణాలు ముఖ్యమైన భాగం. క్యాన్సర్ ఈ కణాలను ప్రభావితం చేసినప్పుడు, ఎముక మధ్యలో అసాధారణ తెల్ల కణాలు ఏర్పడతాయి. ఇది రక్తప్రవాహం ద్వారా శరీరంలోని ఇతర భాగాలకు వెళ్లి ఆరోగ్యకరమైన కణాలను నాశనం చేస్తుంది. ఈ ఆరోగ్యకరమైన కణాలు క్షీణించినప్పుడు, ఇన్ఫెక్షన్, వ్యాధులు పెరుగుతాయి. శరీరం బలహీనపడుతుంది. పిల్లలు, యుక్తవయస్కులు అటువంటి అంటువ్యాధులతో పోరాడటానికి పెద్దల కంటే బలంగా స్పందిస్తారు. పిల్లలు, యువకుల శరీరాలు క్యాన్సర్ చికిత్సలకు మెరుగ్గా స్పందిస్తాయని గుర్తించారు.

**పిల్లలలో బ్లడ్ క్యాన్సర్:** ప్రమాద కారకాలు లుకేమియా కుటుంబ చరిత్రను కలిగి ఉండటం వలన పిల్లలలో క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. దీనిని లి-ఫ్రొమెని సింట్రోమ్ అంటారు. దీని అర్థం వంశపారంపర్య క్యాన్సర్ ప్రమాదం. ప్రభావితమైన జన్యువుల ఆధారంగా పిల్లలకు క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. పిల్లవాడు ఇంతకు ముందు ఏదైనా రేడియేషన్ థెరపీకి గురైనట్లయితే, లేదా బెంజీన్ వంటి రసాయనాల అధిక వినియోగానికి గురైనట్లయితే, లుకేమియా అభివృద్ధి చెందే ప్రమాదం పెరుగుతుంది.

**పిల్లలలో బ్లడ్ క్యాన్సర్ లక్షణాలు ఏమిటి?** చాలా మంది పిల్లలకు లుకేమియా అసాధారణ లక్షణాలు లేవు. ఇది రోగనిరోధక సంబంధిత వ్యాధి. రాజీపడిన రోగనిరోధక వ్యవస్థ కలిగిన ఎవరైనా అనుభవించే ప్రతిదీ లుకేమియా బాధితులలో కూడా కనిపిస్తుంది.

**విపరీతమైన అలసట:** పిల్లవాడు అన్ని సమయాలలో అలసిపోయినట్లు, ఇతర పిల్లలతో ఆడుతున్నప్పుడు అకస్మాత్తుగా అలసిపోయినట్లు అనిపిస్తే, ఇది రోగనిరోధక వ్యవస్థ సమస్యకు సంకేతం కావచ్చు. పిల్లవాడు ఏదైనా కఠినమైన పనులు చేయలేకపోవటం, ఎప్పుడు చూసిన బలహీనంగా ఉన్నట్లయితే వెంటనే దాన్ని తగిన వైద్య పరీక్షలు చేయించాలి.

**రక్తస్రావం లేదా గాయాలు:** పిల్లలకి తరచుగా గాయాలు ఉంటే, అవి త్వరగా నయమయ్యేలా లేదా నయం కావడానికి చాలా సమయం తీసుకుంటే టెస్టులు చేయించాలి. పిల్లలకి రక్తస్రావం ఉంటే, వెంటనే వైద్య సహాయం తీసుకోండి.

**ఇన్ఫెక్షన్ , జ్వరం:** ఇన్ఫెక్షన్, జ్వరం అనేది పిల్లలు పెద్దలలో అన్ని రకాల క్యాన్సర్ల సాధారణ లక్షణం. పిల్లలకి నిరంతర జ్వరం ఉంటే, జ్వరం చాలా కాలం పాటు తగ్గకపోతే, వెంటనే ఆయా టెస్టులు చేయించాల్సి ఉంటుంది. మీకు తరచుగా ఇన్ఫెక్షన్లు మరియు జ్వరాలు ఉంటే, సాధారణ మందులతో సరిగ్గా తగ్గకపోయినా, తరచుగా వైద్యుడిని సంప్రదించాల్సి ఉంటుంది. వెంటనే పరీక్షలు చేయించుకోవాలి.

**శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు:** మీరు తరచుగా లేదా నిరంతర దగ్గు లేదా శ్వాస తీసుకోవడంలో ఎటువంటి అంతర్లీన శ్వాసకోశ సమస్యలు లేకుండా ఉంటే జాగ్రత్తగా ఉండండి. లుకేమియాతో పోరాడుతున్న పిల్లలకి విలక్షణంగా లేని ఇతర లక్షణాలు ఉన్నాయి. వీటిలో చిగుళ్ల సమస్యలు, శరీరంపై దద్దుర్లు, వేగంగా బరువు తగ్గడం, శరీరంలోని ఏదైనా భాగంలో వాపు, కీళ్ల నొప్పులు, తిమ్మిర్లు, తలనొప్పి, నిరంతర వాంతులు ఉన్నాయి. మంచి జీవనశైలిని గడపడం, మీ పిల్లల కోసం ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్లాన్ చేయడం ఈ రోజు ఏ తల్లిదండ్రులకైనా మొదటి ప్రాధాన్యతగా ఉండాలి. ముఖ్యంగా కోవిడ్ అనంతర కాలంలో ఇవి మరీ తప్పనిసరి.

## మీ గుండె ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ ఇలా చేయండి



ఉరుకులు పరుగుల జీవితంలో జీవనశైలి, చెడు ఆహారపు అలవాట్ల కారణంగా గుండె రోగాలు వస్తుంటాయి. గుండె శరీరంలో అతి ముఖ్యమైన అంగం. అందుకే గుండెను పరిరక్షించుకోవల్సిన బాధ్యత ఉంది. తెలిసో తెలియకో చేసే తప్పులు ఆ గుండెను అనారోగ్యానికి గురి చేస్తాయి.

రోజువారీ జీవితంలో చాలా సార్లు అనారోగ్యకరమైన పదార్థాలు తీసుకుంటుంటాం. ఇవి గుండె ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపిస్తుంటాయి. అందుకే ఇటు గుండెతో పాటు అటు శరీరంపై కూడా ప్రత్యేక శ్రద్ధ అవసరం. ముఖ్యంగా అధిక కేలరీలు, సోడియం ఉండే ఆహార పదార్థాల్ని దూరం పెట్టాలి. ఎందుకంటే ఇవి స్థూలకాయం, డయాబెటిస్, హృద్రోగం వంటి సమస్యలకు దారితీస్తాయి. ఈ వ్యాధుల్నించి దూరంగా ఉండాలంటే ఈ ఆహార పదార్థాలను దూరంగా ఉంచాలి.

కూరగాయలు, పండ్లు ఆరోగ్యానికి చాలా మంచివి. ఇందులో మనిషి శరీరానికి కావల్సిన విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. కూరగాయలు, పండ్లలో కేలరీలు తక్కువగా ఉండి..ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. కూరగాయలు, పండ్లు, ప్లాంట్ ఫుడ్స్ గుండె రోగాల్ని నియంత్రించడంలో దోహదపడతాయి. అందుకే మీ డైట్‌లో ఆకు పచ్చని కూరగాయల్ని చేర్చాలి.

ఇక తృణ ధాన్యాల్లో ఫైబర్ మోతాదు అధికంగా ఉంటుంది. ఇందులో పోషక పదార్థాలు కూడా ఎక్కువే. బ్లడ్ ప్రెషర్, గుండె సంబంధిత వ్యాధుల్ని తగ్గిస్తాయి. ప్రోసెస్డ్ ఫుడ్‌ను దూరంగా పెట్టి..ఆ స్థానంలో తృణ ధాన్యాల్ని చేర్చాలి.

మీరు తినే ఆహారంలో ఉప్పు విషయంలో జాగ్రత్త అవసరం. ఉప్పు ఎక్కువగా తీసుకోవడం వల్ల అధిక రక్తపోటుకు గురవుతారు. ఇది గుండెపోటు ముప్పును పెంచుతుంది. ఉప్పు వాడకాన్ని తగ్గించడం ద్వారా వ్యాధుల్ని దూరం చేయవచ్చు.

# మెడికేటెడ్ పాలు తాగితే.. ప్రశాంతంగా నిద్రపడుతుంది..!



ఈ రోజుల్లో నిద్రలేమి పెద్ద సమస్యగా మారింది. ఉద్యోగం.. పనులు.. మానసిక ఇబ్బందులు, ఒత్తిడి కారణంగా చాలామంది సరిగ్గా నిద్రపట్టక సమస్య ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉంటే.. రాత్రుళ్లు సినిమాలు, వెబ్‌సిరీస్‌లు చూసుకుంటూ యంగ్ జనరేషన్ నిద్ర పాడుచేసుకుంటున్నారు. రోజంతా టీ, కాఫీ తాగే వారు, ఆల్కహాల్, స్మోకింగ్ అలవాటున్న వ్యక్తులు కూడా హాయిగా నిద్ర పోలేకపోతున్నారు. నిద్రలేమిని నిర్లక్ష్యం చేస్తే తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. నిద్రలేమితో బాధపడేవాళ్లలో ఆత్మవిశ్వాసం లోపించడం, డిప్రెషన్, ఆందోళన, కోపం, అతిగా తినడం, గందరగోళం.. వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. దీర్ఘకాలికంగా నిద్రలేమితో బాధపడేవారు స్థూలకాయం బారిన పడే ప్రమాదం ఉంది. దీర్ఘకాలిక నిద్రలేమి వల్ల హైబీపీ, టైప్-2 డయాబెటిస్, గుండెజబ్బులు, పక్షవాతం, మూర్ఛ వంటి తీవ్ర సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. నిద్రలేమి కారణంగా రోగనిరోధక వ్యవస్థ బలహీనమై రకరకాల ఇన్ఫెక్షన్లూ సోకుతాయి. నిద్రలేమి సమస్యతో బాధపడేవారు.. లైఫ్‌స్టైల్‌లో మార్పులు చేసుకుని, డైట్‌లో కొన్ని యాడ్ చేసుకుంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు.

రాత్రి నిద్రపట్టకపోతే.. మెడికేటెడ్ పాలు ఔషదంలా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు. మెడికేటెడ్ పాలు తయారు చేయడానికి 1 గ్లాసు పాలలో 1/4 టీస్పూన్ జాజికాయ పొడి, చిటికెడు పసుపు, చిటికెడు యాలకుల పొడి వేసుకోలవాలి. ఆ పాలను ఐదు నిమిషాలు మరిగించాలి. దీన్ని ఫిల్టర్ చేసి నిద్రపోయే ముందు తాగితే నిద్ర బాగా పడుతుంది. ప్రతి రోజూ ఈ పాలు తాగితే.. నిద్రలేమి సమస్య పారిపోతుంది.

**బాదం..** రాత్రి పడుకునే ముందు నానబెట్టిన బాదం తింటే హాయిగా నిద్రపడుతుందట. బాదంలో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. మెగ్నీషియం కండరాలు రిలాక్స్ అవ్వడానికి సహాయపడుతుంది. దీంతో చక్కగా నిద్రపడుతుంది. బాదంలో ఉండే మెలటోనిన్ హార్మోన్ బాడీ క్లాక్ నియంత్రిస్తుంది. నిద్ర సమయం కాగానే.. మీ శరీరాన్ని నిద్రకు సిద్ధం చేస్తుంది. నిద్రకు సమయమైందని శరీరానికి సూచిస్తుంది. బాదంపప్పులో ట్రిప్టోఫాన్ కూడా ఉంటుంది, ఇది సహజమైన నిద్రను ప్రేరేపిస్తుంది.

**అరటిపండు** : అరటిపండులో పొటాషియం, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి కండరాలకు ఉపశమనాన్ని కలిగిస్తాయి. అందుకే మీరు ఒత్తిడికి గురైనప్పుడల్లా అరటిపండు తినాలని నిపుణులు సూచిస్తున్నారు. ఒత్తిడి కారణంగానూ నిద్రలేమి సమస్య వస్తుంది. అరటిపండ్లలోని విటమిన్ బీ6 మీ శరీరంలోని మెలటోనిన్ స్థాయిలను పెంచుతుంది, ఇది నిద్రను ప్రేరేపించడంలో మరింత సహాయపడుతుంది. అరటిపండులో కార్బ్స్ పుష్కలంగా ఉంటాయి, ఇది నిద్రకు మంచిదని నిపుణులు అంటారు.

**చిలగడదుంప:** చిలగడదుంపలోనూ పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు మీరు ప్రశాంతంగా నిద్రపోవ డానికి ఉపయోగపడతాయి. చిలగడ దుంపలో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. ఇది నిద్రలేమి సమస్యను నివారించడానికి బాగా ఉపయోగపడుతుంది. మీరు రాత్రి భోజనంలో చిలగడదుంప తీసుకుంటే మంచిది. చిలగడ దుంపను ఉడకబెట్టడం, రుచికరమైన వంటలు చేసుకుని తింటే మీ నిద్రకు మంచిది.

**వాల్ నట్స్** : మెదడుపై ప్రభావం చూపే ఆహార పదార్థాల్లో వాల్ నట్స్ ఒకటి. ఇందులో ఉండే మెలటోనిన్ హాయిగా నిద్ర పట్టడానికి సహాయపడుతుంది. చెర్రీస్ కూడా నిద్ర బాగా పట్టడానికి ఉపయోగపడుతుంది. రాత్రి పడుకునే ముందు చెర్రీలను తింటే నిద్రాభంగం లేకుండా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

కంటి నిండా నిద్రపోవాలంటే ఓట్స్‌ను ఆహారంలో భాగం చేసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచి స్తున్నారు. ఇందులో ఉండే విటమిన్స్, మినరల్స్, అమినో యాసిడ్స్, మెలటోనిన్ మెదడును ప్రశాంతంగా ఉంచి నిద్ర బాగా పట్టేలా చేస్తుంది.

**సెరోటోనిన్ ఆహారం తీసుకోండి..** మెలటోనిన్ ఉత్పత్తి చేయడానికి సెరోటోనిన్ చాలా కీలకం. చక్కని నిద్రకు మెలటోనిన్ హార్మన్ కీలక పాత్ర పోషిస్తుంది. సెరోటోనిన్ ఉన్న ఆహారం తీసుకుంటే నిద్ర బాగా పడుతుంది. ఇది మరీ ఎక్కువ తీసుకున్నా నిద్ర ఆటంకం కలుగుతుంది. ఓట్స్, నట్స్, గుడ్లు, టోఫూ, సాల్మన్ చేపలు తింటే సెరోటోనిన్ మన శరీరానికి అందుతుంది. అమినో యాసిడ్ ఉన్న ఆహారాలు.. సెరోటోనిన్ ఉత్పత్తికి ఉపయోగాపడతాయి.

**స్నానం చేయండి..** రోజంతా ఇంటా, బయటా పనితో శరీరం, మనసు అలసిపోతాయి. దీన్నుంచి బయటపడాలంటే గోరువెచ్చని నీటితో స్నానం చేస్తే చాలు. శారీరకంగానే కాకుండా, మానసికంగానూ రిలీఫ్‌గా అనిపిస్తుంది. ఇది హాయిగా నిద్రపట్టేలా చేస్తుంది. ఒత్తిడిని దూరం చేయడానికి ప్రాణాయామం చేయడమూ మంచిదే.

**ఈ ఆసనాలు ప్రాక్టీస్ చేయండి..** సమస్యకు చెక్ పెట్టడానికి.. యోగాసనాలు సమర్థవంతంగా పనిచేస్తాయని నిపుణులు అంటున్నారు. యోగాలో నిద్రలేమి సమస్యకు పరిష్కారం ఉంది. యోగాసనాలు ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్ స్థాయిలను తగ్గించడంలో, పీనియల్ గ్రంథి పనితీరును మెరుగుపరచడంలో, జీవక్రియను మెరుగుపరచడంలో సమర్థవంతంగా పని చేస్తాయి. బాలాసనం, ఉత్తానాసనం, శవాసనం, భద్రాసనం వంటి ఆసనాలు ప్రాక్టీస్ చేస్తే నిద్రలేమి దూరం అవుతుంది.

**ఎసెన్షియల్ ఆయిల్స్..** నిద్ర ప్రశాంతంగా పట్టడానికి ఎసెన్షియల్ ఆయిల్స్ హెల్ప్ అవుతాయి. సంపెంగ నూనె, ఫ్రాంకిన్‌సెన్స్, బెంజోన్ ఎస్సెన్షియల్, గంధంనూనె నిద్రలేమి సమస్యను దూరం చేస్తాయి. ఇవి వాసన చూసినా, స్నానం చేసే నీటిలో రెండు చుక్కలు వేసుకుని చేసినా, పడక గదిలో ఈ నూనెలు ఓ గిన్నెలో వేసి ఉంచితే.. నిద్ర చక్కగా పడుతుంది.

**ఈ జాగ్రత్తలు తీసుకోండి..** రోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, నిద్రలేవడం చేస్తుండాలి. ఇలా చేస్తుండడం వల్ల హ్యాపీగా నిద్ర పోవచ్చు.

నిద్రకు ముందు కాఫీ, టీలు తాగకూడదు. ఇలా చేయడం వల్ల నిద్రభంగం కలగొచ్చు.

నిద్రపోయే ముందు ప్రశాంతమైన వాతావరణాన్ని క్రియేట్ చేసుకోండి.

కొంతమంది నిద్రపట్టడం లేదని ఆల్కహాల్ తీసుకుంటుంటారు. ఇలా చేయడం వల్ల అన్ని మరిచిపోయి నిద్రపోవచ్చని భావిస్తారు. కానీ, ఇలా చేయడం వల్ల సమస్య ఎక్కువ అవుతుందని తగ్గదు.

నిద్రపోయే ముందు ముఖ్యంగా త్వరగా జీర్ణం కానీ ఆహార పదార్థాలను తీసుకోకూడదు. దీనివల్ల జీర్ణ వ్యవస్థలో ఇబ్బందులు ఎదురవుతాయి. జీర్ణ సమస్యలు వస్తే రాత్రి మేల్కోవాల్సి వస్తుంది.

నిద్రపోయే ముందు ఫోన్లు వాడొద్దు. ఫోన్ నుంచి వచ్చే బ్లూ రేస్ మీ నిద్ర క్వాలిటీని దెబ్బతీస్తాయి.

పగటిపూట ఎక్కువసేపు నిద్రపోవద్దు.

# ఉపవాసాలలో ఇవి తినండి



**రాజ్‌గిరా ఆలు బోండా..**

బంగాళదుంప స్టఫింగ్ కోసం, 3 మీడియం సైజ్ ఆలుగడ్డలు ఉడకబెట్టినవి, పావు టీ స్పూన్ నల్లమిరియాల పొడి, 8 నుండి 10 జీడిపప్పుల తరుగు, అల్లం, పచ్చిమిర్చి పేస్ట్, 2 టీస్పూన్ల ఎండుద్రాక్ష, అర టీస్పూన్ నిమ్మరం లేదా ఆంచూర్ పొడి, రాతి ఉప్పు.

**పిండికోసం..**

1 కప్పు ఉసిరి పిండి(రాజ్‌గిరి పిండి) సూపర్ మార్కెట్‌లో దొరుకుతుంది.

అరటీస్పూన్ జీలకర్ర, సరిపడా నీరు, ఉప్పు, ఫ్రై చేయడానికి సరిపడా నూనె.

**తయారీ విధానం..**

3.మీడియం బంగాళదుంపలు ఉడక బెట్టండి. బంగాళాదుంపలు వేడిగా ఉన్నప్పుడే పై తొక్కు తీసి ఫోర్క్‌తో వాటిని మెత్తగా చేయాలి. ఇందులో అర టీస్పూన్ నల్ల మిరియాల పొడి, 8 నుండి 10 జీడిపప్పు, 2 టీ స్పూన్ల ఎండు ద్రాక్ష వేసి, ఉప్పు కూడా వేసి కలపండి. అరటీస్పూన్ యాలకుల పొడి, దానిమ్మ పొడి వేయండి. వీటిని బాగా కలపండి. ఈ పిండిని మీడియం సైజ్ బాల్స్ తయారు చేయండి. వాటి టిక్కీలా చేయండి.

**పిండి కోసం**

1 కప్పు ఉసిరిపిండి, అరటీస్పూన్ జీలకర్ర, ఉప్పు కలిపి కొద్ది కొద్దిగా నీరు పోస్తూ కలపండి. ఈ పిండిని బజ్జీ పిండిలా కలపండి.

ఇప్పుడు కడాయిలో నూనె వేసి వేడి చేయండి. బంగాళాదుంప మిశ్రమం తీసుకుని అది పిండిలో ముంచి నూనెలో వేయండి. మీడియం మంటపై కాసేపే వేయించండి. ఆలు బోండా గోల్డెన్ బ్రౌన్ రంగులోకి వచ్చే వరకూ వేయించండి. వీటిని కొబ్బరి చట్నీతో తింటే చాలా బావుంటాయి.

**మఖానా రబ్డీ..**

**కావాల్సిన పదార్థాలు..**

ఫుల్ క్రీమ్ మిల్క్ -3 కప్పులు, కేసర్ కొద్దిగా, చక్కెర 4 టేబుల్ స్పూన్లు, బాదం పప్పులు 8 నుంచి 10, పిస్తాపప్పులు 5 నుంచి 6, ఎండు ద్రాక్ష 5 నుంచి 6, యాలకుల పొడి అరటీస్పూన్, మఖానా 2 కప్పులు.

**తయారీ విధానం**

ఓ మందపాటి గిన్నెలో ఫుల్ క్రీమ్ పాలు తీసుకుని మరిగించాలి. అవి సగానికి అయ్యే వరకూ కలుపుతూ మరిగిస్తూనే ఉండాలి. ఆ తర్వాత పంచదార, కేసర్ వేయండి. బాగా కలపండి. దగ్గరికి రబ్డీలా అవ్వాలి. అప్పుడు మంటని ఆపేసి చల్లారనివ్వండి. తర్వాత డ్రై ఫ్రూట్స్ వేయండి. రబ్డీ తయారైంది..

ఇప్పుడు మరో మందపాటి గిన్నె తీసుకుని అందులో 2 టీ స్పూన్ల నెయ్యి వేసి 2 కప్పుల మఖానాని కరకరలాడే వరకు వేయించండి. మఖానా మాడిపోకుండా దోరగా వేయించండి.ఇప్పుడు వీటిని రబ్డీలోకి వేయండి. రబ్డీ చల్లారక డ్రై ఫ్రూట్స్‌తో గార్నిష్ చేసి అరగంట ముందు ఫ్రిజ్‌లో పెట్టండి. ఇంకేంటి అరగంట తర్వాత ఆరగించడమే.

**బీట్‌రూట్ కట్‌లెట్స్..**

1 పెద్ద బీట్రూట్ పొట్టు తీసి తురిమి పెట్టుకోవాలి.

2 మీడియం బంగాళాదుంపులు ఉడికించి పొట్టు గుజ్జులా చేయాలి.

1 టేబుల్ స్పూన్ ఆలివ్ ఆయిల్, 1 టేబుల్ స్పూన్ అల్లం పేస్ట్, 1 లేదా 2 తాజా పచ్చిమిర్చి తరుగు, అర టీస్పూన్ జీలకర్ర, అర స్పూన్ గరం మసాలా, ముప్పావు కప్పు జీడిపప్పు సన్నగా తరగాలి. రుచికి సరిపడా ఉప్పు.

**తయారీ పద్ధతి..**

పాన్‌లో ఆలీవ్ ఆయిల్ వేడి చేసి అందులో జీరా వేయండి. జీలకర్ర చిటపటలాడాక అల్లం పేస్ట్ వేయించి కాసేపటికి బీట్ రూట్ తురుము, ఉప్పుని వేయండి. బీట్‌రూట్ కొద్దిగా ఫ్రై అయ్యేవరకూ వేయించండి. ఇప్పుడు బంగాళాదుంప గుజ్జు, పచ్చిమిర్చి, గరం మసాలా, ఉప్పు వేసి వేయించండి.

ఇప్పుడు మంట ఆర్పేసి మిశ్రమాన్ని గోరువెచ్చగా అయ్యేవరకూ ఉంచండి.

మీ అరచేతుల్లోకి పిండిని తీసి వాటిని కట్‌లెట్‌లా చేయండి.

జీడిపప్పుని తురుములా చేసి ఓ ప్లేట్‌లో వేయండి.

ఇప్పుడు టిక్కీలను జీడిపప్పు అంటుకునేలా నొక్కండి. తర్వాత ఓ పాన్‌లో నూనె వేసి తయారైన టిక్కీలను గోల్డెన్ బ్రౌన్ రంగులోకి వచ్చేవరకూ వేయించండి.

ఫ్రై అయిన టిక్కీలను పేపర్ నాప్‌కిన్‌పై వేయండి

వీటిని చట్నీతో వేడిగా సర్వ్ చేయండి.

# అనకాపల్లిలో కల్కి విజయోత్సవం




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పాన్ ఇండియా హీరో ప్రభాస్ నటించిన కల్కి చిత్రం అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచ వ్యాప్తం గా నేడు విడుదలై మంచి టాక్ తో ప్రదర్శించబడుతున్న సందర్భంగా అనకాపల్లి పట్టణ ప్రభాస్ ఫ్యాన్స్ రథ సారథులు జీ.వి. ఎల్ ఎన్.రాజు,ఆళ్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో అనకాపల్లి రామచంద్రా థియేటర్ వద్ద అభిమానుల కేరింతల నడుమ అట్టహాసం గా విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు.ఈసందర్భంగా అభిమానుల సమక్షంలో విజయోత్సవ కేక్ కట్ చేశారు..అభిమానుల కేరింతల నడుమ అనకాపల్లి పట్టణ ప్రభాస్ ఫ్యాన్స్ రథ సారథులు జీ.వి. ఎల్ ఎన్.రాజు,ఆళ్ల ప్రవీణ్ మాట్లాడుతూ..ప్రపంచవ్యాప్తం గా విడుదలైన ఈ సినిమా మహాభారతం లో నీ అశ్వద్ధామ పాత్ర నీ కంటిన్యూ చేస్తూ సైన్స్ ఫిక్షన్ సినిమా గా తయారైందని తెలుగు సినిమా స్థాయిని పెంచే విధంగా హాలీవుడ్ స్థాయిలో రూపుదిద్దుకున్న ఈచిత్రం విజువల్ వండర్ గా ఉందని ప్రతి ఒక్క ఫ్యామిలీ చూడాల్సిన చిత్రం ఇదని అన్నారు.. ప్రపంచ వ్యాప్తం గా తొలి రోజు వసూళ్ళల్లో అల్ టైం రికార్డ్ సృష్టించనుందని ఓపెనింగ్స్ చూస్తే తెలుస్తుందని అన్నారు..ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో ప్రభాస్ అభిమానులు పాల్గొన్నారు.

# ప్రతి మారు మూల గ్రామానికి తాగు నీరు అందాలి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** గిరిజన గ్రామాలకు ఫీడర్ అంబులెన్సులు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా అధికారులతో సమీక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ జిల్లాను అభివృద్ధి పథంలో నడపాలని కోరారు. త్వరలో ఐటీడీఏ పాలక మండలి సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. పాలన ప్రజల వద్దకు వెళ్ళాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ ఉండరాదని స్పష్టం చేశారు. రైతులు అడిగిన విత్తనాలు ఇవ్వాలని, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులపై దృష్టి సారించాలని, వాటికి చెక్ పెట్టాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. విత్తనాలు, ఎరువులకు నిలబడి ఎండలో పడిపోయే పరిస్థితి ఉండరాదని ఆమె అన్నారు. పంట కొనుగోలు కేంద్రాలు సక్రమంగా పనిచేయాలని ఆమె అన్నారు. చివరి భూముల వరకు నీరు అందాలని ఆదేశించినట్లు చేశారు. తోటపల్లి నీటిని జూలై 1వ తేదీన విడుదలకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు.

అంబులెన్సులు మరమ్మతులకు గురి అయితే వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని అన్నారు. డోలి పరిస్థితి ఎక్కడా ఉండకుండా చర్యలు చేపట్టాలని, ఇందుకు అవసరమగు రహదారులపై కూడా దృష్టి సారించామని అన్నారు. ప్రతి ఆసుపత్రిలో అన్ని మందులు అందుబాటులో ఉండాలని ఆదేశించినట్లు చెప్పారు. మందులు, వైద్యం అందక మరణించే పరిస్థితి ఉండరాదని ఆమె స్పష్టం చేశారు. రిఫరల్ ఉండరాదని మంత్రి అన్నారు. గిరిజన గ్రామాలకు ఫీడర్ అంబులెన్సులు నడపనున్నట్లు తెలిపారు.

అంగన్వాడీ లకు సరఫరా చేసే గ్రుడ్లు, పాలు నాణ్యత కలిగి ఉండాలని మంత్రి అన్నారు. గిరి గోరు ముద్ద తిరిగి ప్రారంభం చేయుటకు యోచిస్తున్నమని చెప్పారు. బాల్య వివాహాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద చిన్నారులను పెట్టి యాచించడం జరుగుతోందని దాన్ని నివారించాలని ఆమె అన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహాల్లో విద్యార్థులకు దుప్పట్లు, కంచాలు, గ్లాసులు, పుస్తకాలు అందించాలని ఆమె చెప్పారు. ప్రతి మారు మూల గ్రామానికి ముఖ్యంగా గిరి శిఖర గ్రామాలలో తాగు నీరు అందాలని మంత్రి అన్నారు. తాగునీరు అందని గ్రామం జిల్లాలో ఉండరాదని ఆమె స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణాలు, నాణ్యత, లే అవుట్ స్థలాలుపై నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు ఆమె చెప్పారు. లే అవుట్ లపై జరిగిన అక్రమాలపై కమిటి వేసి చర్యలకు నిర్ణయం తీసుకుంటామని ఒక ప్రశ్నకు బదులిస్తూ తెలిపారు. పారాది కాజ్ వే కొట్టుకు పోవడంతో సాలూరు లారీలకు మక్కువ మీదుగా వెళ్ళుటకు అవకాశం కల్పించాలని సూచించామని చెప్పారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, పాలకొండ శాసన సభ్యులు నిమ్మక జయకృష్ణ, కురుపాం శాసన సభ్యులు తోయక జగదీశ్వరి,

పార్వతీపురం శాసన సభ్యులు బోనెల విజయ చంద్ర, జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక, ఇన్ ఛార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి జి కేశవ నాయుడు, ఎస్డిసి ఆర్ వి సూర్యనారాయణ పాల్గొన్నారు.

# అనకాపల్లిలో ఆదిత్య డిగ్రీ కాలేజీ ప్రారంభం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలో నూతనంగా ఏర్పాటు అయిన ఆదిత్య డిగ్రీ కాలేజ్ ప్రారంభోత్సవ వేడుకలలో ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు, కొణతాల రామకృష్ణ మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ టీడీపి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ ఆదిత్య కాలేజి చైర్మన్ శేషారెడ్డి తో కలిసి కళాశాలను ప్రారంభించారు. ఈ సంధర్భంగా జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

# చేసిన పాపాలు ఊరికే పోవు: దేవినేని ఉమా

మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెలి రామకృష్ణారెడ్డి అరెస్ట్ నేపథ్యంలో, టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమా స్పందించారు. మాచర్లలో వైసీపీ అరాచకాలకు తెరపడిందని పేర్కొన్నారు.

ఈవీఎంలను పగులగొట్టి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని, చంబల్ లోయ మాదిరిగా సొంత సామ్రాజ్యంలా మార్చుకుని లెక్కకు మించిన తప్పులు చేశారని ఉమా విమర్శించారు. దాడులు, హత్యలతో అరాచకాలకు అడ్డాగా మార్చారని ధ్వజమెత్తారు.

చేసిన పాపాలు ఊరికే పోవని, ఎన్నికల హింస కేసులో కటకటాల వెనక్కి వెళ్లారని పేర్కొన్నారు. తప్పులు చేసిన వారికి ఎప్పటికైనా శిక్ష తప్పదు అంటూ దేవినేని ఉమా తన ట్వీట్ ను జగన్ కు ట్యాగ్ చేశారు.

గతంలో పల్నాడులో టీడీపీ నేతల కారుపై దాడి జరిగిన దృశ్యాలను, పిన్నెల్లి ఈవీఎంను పగులగొట్టిన క్లిప్పింగ్ ను కూడా ఉమా వీడియో రూపంలో పంచుకున్నారు.

# సంక్షేమం, అభివృద్ధి పై మా బాధ్యత ను ప్రజలు మరింత పెంచారు



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** సంక్షేమం, అభివృద్ధి పై ప్రజలు మా పై ఎంతో బాధ్యత పెట్టారని శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గురువారం పార్వతీపురం జిల్లా టి డి పి పార్టీ కార్యాలయం లో తొలుత ఎన్ టి ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ ముఖ్యమంత్రి మంత్రులు ప్రమాణ స్వీకారం అయ్యాక ప్రతిపక్ష హెూదా లేకపోయినా జగన్మోహన్ రెడ్డికి మాజీ ముఖ్యమంత్రి గా గుర్తించి ప్రమాణ స్వీకారానికి అవకాశం కల్పించడం జరిగిందని మంత్రి గుర్తు చేశారు. ఆయన ప్రమాణ స్వీకారం చేసి ఒక్క నిమిషం కుర్చీలో కూర్చోకుండా వెళ్లిపోయారని మిగతా పదిమంది ఎమ్మెల్యేలను వదిలేసారని ఆ పార్టీ ఎమ్మెల్యేలను కూడా గౌరవించలేని పరిస్థితిని మంత్రి అన్నారు. అసెంబ్లీలో ఒక్క నిమిషం కూర్చొని ఓపిక లేని ఆయన సరదాల సంక్షేమం అంటూ అసత్యాలు చెప్పారని పేర్కొన్నారు. ప్రజలు ఎంతో బాధ్యతతో రాత్రి 11 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి ఓట్లు వేశారని చంద్రబాబు నాయుడు పై ఉన్న నమ్మకముతోనే ఓటర్లు ఇతర దేశాల నుంచి తరలివచ్చారని అన్నారు 164 సీట్లు ఇచ్చారంటే మా బాధ్యత మరింత పెరిగిందని అందుకు తగ్గట్టుగా సంక్షేమ అభివృద్ధి పాలన ఉంటుందని మంత్రి అన్నారుమంత్రితోపాటు పార్వతీపురం కురుపాం పాలకొండ ఎమ్మెల్యేలు విజయ్ చంద్ర, జగదీశ్వరి, జయకృష్ణ, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు ద్వారపు రెడ్డి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

# తుమ్మపాల పాల సంఘం అధ్యక్షుడు కాశీని సత్కరించిన ఎమ్మెల్యే కొణతాల



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలోని, రింగ్ రోడ్డు లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో తుమ్మపాల-1 పాల ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన తుమ్మపాల గ్రామ టీడీపీ అధ్యక్షుడు చదరం కాశీ విశ్వేశ్వరరావునీ స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాజీ శాసన సభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంధర్భంగా నియమాంక పత్రాన్ని వారికి అందజేశారు. అనంతరం వారిని సత్కరించారు.పాడి రైతుల అభివృద్ధికి, పాల దిగుమతి పెంచడానికి కృషిచేయాలని అకాంక్షించారు.

# రైతులు కు సకాలంలో విత్తనాలు సరఫరా చేయాలి

**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** రైతులు అడిగిన విత్తనాలు సరఫరా చేయాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి గుమ్మిడి సంధ్యా రాణి అన్నారు. మంత్రి పదవి స్వీకరణ అనంతరం మొట్టమొదటి సారిగా అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి విచ్చేసిన మంత్రికి ఘనస్వాగతం లభించింది. సమీక్షలో మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ జిల్లాను అభివృద్ధి పథంలో నడపాలని కోరారు. త్వరలో ఐటీడీఏ పాలక మండలి సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. పాలన ప్రజల వద్దకు వెళ్ళాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ ఉండరాదని స్పష్టం చేశారు. పనులు వేగంగా జరగాలని, నిర్వహణకు అవసరమగు మరమ్మతులకు అంచనాలు తయారు చేయాలని అన్నారు. అయితే అంచనాలు నిర్దిష్టంగా ఉండాలని ఆమె అన్నారు. భూ సమస్యలు ఉన్నాయని, వాటిని నివారించాలని సూచించారు. రైతులు అడిగిన విత్తనాలు ఇవ్వాలని, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించాలన్నారు.

నకిలీ విత్తనాలు, ఎరువులపై దృష్టి సారించాలని, వాటికి చెక్ పెట్టాలని ఆమె ఆదేశించారు. విత్తనాలు, ఎరువులకు నిలబడి ఎండలో పడిపోయే పరిస్థితి ఉండరాదని ఆమె అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఇచ్చిన పంట నష్ట పరిహారం వివరాలు, పెండింగ్ వివరాలు సమర్పించాలని ఆదేశించారు. వ్యవసాయ యాంత్రిక పరికరాలు రాయితితో ఇచ్చే అవకాశాలు గురించి ప్రశ్నించగా మార్గదర్శకాలు రావలసి ఉందని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వ్యవసాయ సహాయకులు పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యాన పంటలకు నష్టపరిహారం చెల్లింపు వివరాలు సమర్పించాలని ఆమె ఆదేశించారు. పంట కొనుగోలు కేంద్రాలు సక్రమంగా పనిచేయలేదని ఆరోపణలు ఉన్నాయని ఆమె అన్నారు. రైతులు నుండి కొనుగోలు చేసిన వారం రోజులలో చెల్లింపులు చేయాలని ఆమె పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి స్పష్టంగా ఉన్నారని ఆమె తెలిపారు.మొక్క జొన్న, పత్తి కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులూ ఉండరాదని ఆమె అన్నారు. ప్రభుత్వ లోగో ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలు మాత్రమే అందించాలని మంత్రి స్పష్టం చేశారు. చివరి భూముల వరకు నీరు అందాలని మంత్రి స్పష్టం చేశారు. ఇందుకు కనీసం పూడిక తీతలు, తుప్పలు తొలగించాలని తద్వారా ప్రయోజనం కలుగుతుందని ఆమె అన్నారు. అంబులెన్సులు మరమ్మతులకు గురి అయితే వాటికి వెంటనే మరమ్మతులు చేయించాల్సిన అవసరం



ఉందన్నారు. డోలి పరిస్థితి ఎక్కడా ఉండకుండా చర్యలు చేపట్టాలని, ఇందుకు అవసరమగు రహదారులపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. వసతి గృహాల్లో జ్వరాలు ఇకపై ప్రారంభం అవుతుందని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. చిన్నారులకు మలేరియా సోకే అవకాశం ఉందని, మందులు సిద్ధం చేయాలని ఆమె ఆదేశించారు. ప్రతి ఆసుపత్రిలో అన్ని మందులు అందుబాటులో ఉండాలని ఆమె ఆదేశించారు. వసతి గృహాల్లో వైద్య పరీక్షలు నిరంతరం జరగాలని అన్నారు. వసతి గృహాల్లో ఏఎన్ ఎం నియామకంపై చర్యలు చేపడుతున్నామని ఆమె తెలిపారు. మందులు, వైద్యం అందక మరణించే పరిస్థితి ఉండరాదని ఆమె స్పష్టం చేశారు. రిఫరల్ ఉండరాదని మంత్రి అన్నారు. ప్రాణం పోతే తీసుకురాలేమని ఆమె అన్నారు. పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. గిరి శిఖర గ్రామాల ప్రజలు ఎక్కడ దగ్గర అయితే అక్కడ వైద్యానికి చేరువ కావాలని ఆమె సూచించారు. గిరిజన గ్రామాలకు ఫీడర్ అంబులెన్సులు నడపనున్నట్లు తెలిపారు. రక్తదాన శిబిరాలు జిల్లా ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగేటట్లు చర్యలు చేపట్టాలని తద్వారా జిల్లా వాసులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఆసుపత్రులలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఇపిడిసిఎల్ ఇంజినీర్లను ఆదేశించారు. అంగన్వాడీ లకు సరఫరా చేసే గ్రుడ్లు, పాలు నాణ్యత కలిగి ఉండాలని మంత్రి ఆదేశించారు. వాటిపై ఏ బొమ్మలు ఉండరాదని ఆమె స్పష్టం చేశారు. గిరి గోరు ముద్ద తిరిగి ప్రారంభం చేయుటకు యోచిస్తున్నమని అన్నారు. అంగన్వాడీ పోస్టులు భర్తీ సంవత్సరంలో ఒక నిర్దిష్ట కాలంలో జరపాలని ఆమె అన్నారు. బాల్య వివాహాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద చిన్నారులను పెట్టి యాచించడం జరుగుతోందని దాన్ని నివారించాలని ఆమె ఆదేశించారు. బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నివారించాలని, దృష్టి సారించాలని ఆమె ఆదేశించారు. అంగన్వాడీ కార్యకర్తలకు నెలకు ఒక సమావేశం మినహా నిర్వహించరాదని మంత్రి ఆదేశించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహాల్లో విద్యార్థులకు దుప్పట్లు, కంచాలు, గ్లాసులు, పుస్తకాలు విధిగా అందించాలని ఆమె ఆదేశించారు. దీనిపై చర్యలు తీసుకుంతున్నమని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందాలని, ఆకస్మిక తనిఖీలు చేస్తామని ఆమె తెలిపారు. పౌష్టిక ఆహారం అందాల్సిందేనని స్పష్టం చేశారు. వసతి గృహాల్లో స్టడీ అవర్స్ నిర్వహించాలని ఆదేశించారు. బయటకు వెళుతున్న పిల్లలు, లోనకు వస్తున్న పిల్లలు, తల్లిదండ్రులు వివరాలు రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆమె ఆదేశించారు. బాలికల విద్యాలయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. ఎటువంటి సంఘటనలకు తావు ఉండరాదని ఆమె అన్నారు. విద్యార్థుల బోధనపై దృష్టి పెట్టాలని, విద్యా ప్రమాణాలు పక్కాగా ఉండాలని ఆమె చెప్పారు. ప్రతి మారు మూల గ్రామానికి ముఖ్యంగా గిరి శిఖర గ్రామాలలో తాగు నీరు అందాలని మంత్రి ఆదేశించారు. తాగునీరు అందని గ్రామం జిల్లాలో ఉండరాదని ఆమె స్పష్టం చేశారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చేపట్టాలని ఆదేశించారు. తాగు నీటి పథకాలు శుభ్రత విధిగా చేపట్టాలని తద్వారా అతిసార వంటి వ్యాధులు నివారించవచ్చని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు, నాణ్యత, లే అవుట్ స్థలాలుపై నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతుల అవసరాలకు గుర్తించాలని సూచించారు. ఉపాధి హామీ క్రింద సాగు నీటి ప్రాజెక్టుల క్రింద పూడికలు తొలగించాలని ఆదేశించారు. అంబులెన్సులు వెంటనే మరమ్మతులు చేయించాలని ఆయన ఆదేశించారు. ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు జిల్లాకు అవసరం ఉందని, ప్రతిపాదనలు ఇప్పటికే సమర్పించామని చెప్పారు. పి హెచ్ సి లలో మలేరియా కేసులు పరీక్షించుటకు కిట్లు పెట్టాలని ఆయన ఆదేశించారు. నిర్మాణం ఆగిన అంగన్వాడీ భవనాలు పూర్తి చేయుటకు ప్రతిపాదనలు సమర్పించామన్నారు. అంగన్వాడీ సరుకులు పంపిణీలో లోపాలు జరిగితే చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. బాల్య వివాహాల నివారణకు గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించాలని అన్నారు. మే చివరి వారం నుండి పారిశుధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నామని, నీటి పథకాలు శుభ్రత, నీటి పరీక్షలు చేపట్టడం జరుగుతోందని తెలిపారు. ఆసుపత్రులలో విద్యుత్ పరిస్థితిపై తనిఖీ నిర్వహించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పాలకొండ శాసన సభ్యులు నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ పాలకొండ ఏరియా ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ లేదని, దానిపై దృష్టి సారించాలని కోరారు.

కురుపాం శాసన సభ్యులు తోయక జగదీశ్వరి మాట్లాడుతూ అంబులెన్సులు లేక గిరిజన గ్రామాలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. గుమ్మలక్ష్మీపురం సి హెచ్ సి, పి హెచ్ సి లలో మందులు లేవని, అంబులెన్సు ఐదు సంవత్సరాలుగా మూలన పడి ఉందన్నారు. పార్వతీపురం శాసన సభ్యులు బోనెల విజయ చంద్ర మాట్లాడుతూ ఉద్యాన పంటల మార్కెటింగ్ పై దృష్టి సారించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం పరిస్థితి వివరాలను అడిగారు. తాగు నీటి ద్వారా సంభవించే వ్యాధులు నివారించాలని ఆయన సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి కె రాబర్ట్ పాల్ మాట్లాడుతూ టార్పాలిన్లు, ఆయిల్ ఇంజిన్లు అవసరం ఉందన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులపై విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామని ఆయన చెప్పారు. సమీకృత లాబ్ లలో పరీక్షలు చేయించవచ్చని తెలిపారు. జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీరు రాజరాజేశ్వరి మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు కాలువలు మరమ్మతులు చేయుటకు ప్రతిపాదనలు సమర్పిస్తున్నామన్నారు.జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు మాట్లాడుతూ జిల్లాలో 320 కిలోమీటర్ల మేర సాగు నీటి కాలువలు పూడికలు తొలగింపుకు ఇప్పటికే మంజూరు జరిగిందన్నారు. జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.ఆర్.కృష్ణాజి మాట్లాడుతూ ఆర్ సి పి ఎల్ డబ్ల్యు పథకం క్రింద 25 పనులు చేపట్టామని అందులో 9 పనులు పూర్తి అయ్యాయని, ఉపాధి హామీ పథకం క్రింద 311 భవనాల పనులు చేపట్టగా 126 పూర్తి అయ్యాయని తెలిపారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు మాట్లాడుతూ జిల్లాలో 1.40 కోట్ల పని దినాలు కల్పించుట లక్ష్యంగా పనిచేస్తున్నమన్నారు. తద్వారా రూ.218 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ రానుందని చెప్పారు. రూ.350 కోట్ల వరకు వేతనాలు అందుతాయని చెప్పారు. గత ఏడాది 128 కిలోమీటర్ల మేర బిటి రహదారులు నిర్మించామని తెలిపారు. సంబంధిత అధికారులు తమ శాఖలు చేపడుతున్న పనులు ప్రగతి వివరించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక, ఇన్ ఛార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి జి కేశవ నాయుడు, ఎస్డిసి ఆర్ వి సూర్యనారాయణ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రాజ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ పార్వతి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.బి. వాగ్దేవి, ఆరోగ్య శ్రీ జిల్లా సమన్వయ అధికారి డా కొయ్యాన అప్పారావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై సత్యం నాయుడు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజనీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా విద్యా శాఖ అధికారి జి పగడాలమ్మ, జిల్లా ఉద్యాన అధికారి కె ఎస్ వర ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఎం ఎన్ రాణి, జిల్లా ప్రణాళిక అధికారి పి. వీర రాజు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎం రుక్మాంగదయ్య, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారి ఎస్ వేణుగోపాల రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్ శివ ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి డా టి జగన్మోహన రావు, ఇపిడిసిఎల్ కార్యనిర్వహక ఇంజనీర్ వి వి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# సినిమా



## నీ తప్పేమీ లేదు: నాగార్జున



టాలీవుడ్ సీనియర్ హీరో నాగార్జున ప్రస్తుతం కుబేర మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. ధనుష్ కూడా నటిస్తున్న ఈ మూవీకి శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి విడుదలైన నాగ్ లుక్స్ మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. అయితే రీసెంట్ గా ముంబై ఎయిర్ పోర్ట్ లో నాగార్జున బౌన్సర్ ఓ దివ్యాంగుడి పట్ల దురుసుగా ప్రవర్తించడం సోషల్ మీడియాలో పెద్ద దుమారం రేపింది. నాగ్ తో ఓ అభిమాని ఫోటో దిగడానికి ప్రయత్నించగా.. పక్కనే ఉన్న బాడీగార్డ్ ఆ దివ్యాంగుడిని వెనక్కి లాగాడు. దీంతో అతడు ఒక్కసారిగా కిందపడబోయాడు. అందుకు సంబంధించిన వీడియో వైరల్ కాగా.. బాడీగార్డ్ చేసిన తప్పు వల్ల నాగార్జున తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. ఆ తర్వాత నాగార్జున ఆ అభిమానికి క్షమాపణలు చెప్పారు. అలా జరగాల్సింది కాదని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. తాజాగా కుబేర షూటింగ్ లో పాల్గొనేందుకు నాగార్జున మరోసారి ముంబై వెళ్లారు. మొన్న కిందపడబోయిన ఫ్యాన్ నేడు నాగార్జున దగ్గరకు వచ్చాడు. అతడు రాగానే.. మొన్న మీతో ఫోటో దిగాలనుకున్నది ఇతడే అని ఫోటోగ్రాఫర్లు గుర్తు చేశారు. దీంతో నాగ్ అతడిని ఆప్యాయంగా హత్తుకున్నారు. అతడితో ఫోటోలు కూడా దిగారు. కాసేపు మాట్లాడారు. అప్పుడు అతడు నాగార్జునకు సారీ చెప్పగా.. ఇందులో నీ తప్పేమీ లేదని నాగ్ అన్నారు. మొన్న బాడీ గార్డ్ చేసిన పని వల్ల తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న నాగార్జున.. ఇప్పుడు ఆ అభిమానితో పిక్ తీసుకోవడం విశేషం. మిగిలిన ఫ్యాన్స్ తో కూడా నాగ్ ఈసారి ఫోటోలు దిగారు. అందుకు సంబంధించిన వీడియో ఫుల్ ట్రెండ్ అవుతోంది. నాగార్జున అభిమానులు తెగ షేర్ చేస్తున్నారు. రియల్ హీరో అంటూ కొనియాడుతున్నారు. మా నాగ్ సార్ బంగారం అంటూ కామెంట్లు పెడుతున్నారు. మొత్తానికి నాగ్ తో ఫోటో దిగడంతో ఆ ఫ్యాన్ ఫుల్ హ్యాపీ అయ్యాడు. అయితే నాగార్జున సంక్రాంతికి నా సామిరంగా మూవీతో వచ్చి మంచి హిట్ అందుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు కుబేరలో లీడ్ రోల్ పోషిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా నుంచి టీజర్ రిలీజ్ కానుందని టాక్ నడుస్తోంది. అయితే మనసుల్ని హత్తుకునేలా కథలు చెప్పడంలో శేఖర్ కమ్ముల దిట్ట. తన మార్క్ స్టోరీలను సిల్వర్ స్క్రీన్ పై హెూమ్లీగా చూపిస్తారు. మరి కుబేరలో నాగార్జున రోల్ ను శేఖర్ కమ్ముల ఎలా డిజైన్ చేశారో చూడాలి.

## కల్కి సీక్వెల్ ఉంటుందా? ఉండదా?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ కాంబోలో రెడీ అయిన కల్కి 2898 ఏడీ మూవీ మరికొద్ది గంటల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ కానున్న విషయం తెలిసిందే. సినీ ప్రియులతో పాటు ప్రభాస్ ఫ్యాన్స్ అంతా సినిమా చూసేందుకు సిద్ధంగా ఉన్నారు. నాగ్ అశ్విన్ క్రియేట్ చేసిన అద్భుతమైన ప్రపంచం ఎలా ఉంటుందోనని చర్చించుకుంటున్నారు. ఏదేమైనా సినిమా మాత్రం హాలీవుడ్ రేంజ్ లో ఉండడం గ్యారెంటీ! అయితే మరికొద్ది గంటల్లో మూవీ రిలీజ్ అవుతుందనగా.. సోషల్ మీడియాలో ఇప్పుడు పెద్ద చర్చ నడుస్తోంది. ఈ సినిమాకు సీక్వెల్ ఉంటుందా? ఉండదా? లేకుంటే అంతా ఒక్కసారే చూపిస్తారా? ఇప్పుడు అంతా దీని గురించే డిస్కస్ చేసుకుంటున్నారు. ఎందుకంటే ప్రస్తుతం సీక్వెల్స్ ట్రెండ్ నడుస్తున్న విషయం తెలిసిందే. ఫస్ట్ పార్ట్ ను ఇంట్రెస్ట్ గా ఆపేసి.. రెండు పార్ట్ లో ముగిస్తున్నారు. కానీ కల్కి విషయంలో ఇప్పటి వరకు మేకర్స్ క్లారిటీ ఇవ్వలేదు. చాలా మంది మాత్రం.. కల్కికి సీక్వెల్ కచ్చితంగా ఉంటుందని బల్లగుద్ది చెబుతున్నారు. కల్కి లాంటి పెద్ద సినిమా కథలు ఒక్క పార్ట్ లో ఎవరూ చెప్పలేరని అంటున్నారు. ముఖ్యంగా నాగ్ అశ్విన్.. ఈ సినిమాలో మూడు ప్రపంచాలను క్రియేట్ చేసినట్లు చెప్పిన విషయం తెలిసిందే. పురాణాల కాన్సెప్ట్ ను తీసుకున్నట్లు కూడా చెప్పారు. కాబట్టి ఒక్క పార్ట్ లో సినిమా అంతా క్లారిటీగా చెప్పలేరని, అందుకే సీక్వెల్ పక్కా ఉంటుందని చెబుతున్నారు నెటిజన్లు. అయితే ఇంతకుముందు సీక్వెల్ కోసం చర్చ జరిగిన సమయంలో.. కమల్ హాసన్ తొలి భాగంలో కనిపించరని వార్తలు వచ్చాయి. మొత్తం ఆయన పార్ట్ సీక్వెల్ లోనే ఉంటుందనే టాక్ వినిపించింది. కమల్, ప్రభాస్ మధ్య యుద్ధం జరుగుతుందని ఇప్పటికే ట్రైలర్ ద్వారా లైట్ గా క్లారిటీ వచ్చింది. ఆ సీక్వెన్స్ సెకండ్ పార్ట్ లోనే ఉంటుందని చెబుతున్నారు నెటిజన్లు. ఫస్ట్ పార్ట్ లో కమల్ కాసేపు మాత్రమే కనిపిస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది. సినిమా అంతా అయ్యాక.. చివరలో సెకండ్ పార్ట్ కోసం మేకర్స్ చెప్పే అవకాశం ఉందని సినీ ప్రియులు అంచనా వేస్తున్నారు. ఏది ఏమైనా ప్రేక్షకుల్లో ఎక్కువ మంది మాత్రం సీక్వెల్ ఉంటుందనే అంటున్నారు. మరికొన్ని గంటల్లో యూఎస్ లో ప్రీమియర్స్ పడబోతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఉదయం 5.30 గంటలకు బెనిఫిట్ షోస్ ఉన్నాయి. దీంతో సీక్వెల్ కు సంబంధించి మరికొన్ని గంటల్లో ఒక క్లారిటీ వచ్చేయనుంది. మరి నాగ్ అశ్విన్ ఏం ప్లాన్ చేశారో వేచి చూడాలి.

## దళపతి గోట్ సైలెన్స్ కి రీజన్ ఏంటి..?



కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ సినిమా రిలీజ్ అంటే ఆ హీరో ఫ్యాన్స్ చేసే హంగామా ఒక రేంజ్ లో ఉంటుంది. తమిళ్ లో నెంబర్ 1 స్టార్ గా తిరుగులేని క్రేజ్ తెచ్చుకున్న విజయ్ ఆ ఇమేజ్ కి తగినట్టుగానే సినిమా సక్సెస్ లు అందుకుంటున్నాడు. దళపతి విజయ్ సినిమా అంటే చాలు ఫ్యాన్స్ కి పూనకాలు వచ్చేస్తాయి. ప్రస్తుతం విజయ్ వెంకట్ ప్రభు కాంబినేషన్ లో వస్తున్న సినిమా జి.ఓ.ఏ.టి. సినిమాలో విజయ్ డ్యుయల్ రోల్ లో నటిస్తున్నారని తెలిసిందే. మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తున్న ఈ ప్రాజెక్ట్ లో త్రిష కూడా ఇంపార్టెంట్ రోల్‌లో ఛాన్స్ దక్కించుకుంది. సెప్టెంబర్ 5న రిలీజ్ లాక్ చేసుకున్న ఈ సినిమా విషయంలో మేకర్స్ అంతా కూడా చాలా సైలెంట్ గా ఉన్నారు. సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్ వదిలిన చిత్ర యూనిట్ లేటెస్ట్ గా సాంగ్ ని వదిలారు. దళపతి గోట్ సినిమా మరోసారి ఫ్యాన్స్ తో పాటుగా ఆడియన్స్ కు మంచి మాస్ ట్రీట్ అందిస్తుందని అంటున్నారు. ఐతే సినిమా గురించి ఎక్కువగా రివీల్ చేసి ఆ తర్వాత అంచనాలను అందుకోలేదని అనుకోవడం కన్నా సినిమా గురించి ఎలాంటి క్లూస్ ఇవ్వకుండా థియేటర్ లో ప్రేక్షకులు సర్ ప్రైజ్ అయ్యేలా ప్లాన్ చేస్తున్నారట. అందుకే దళపతి గోట్ గురించి ఎక్కువగా డిస్కషన్స్ జరగట్లేదని అంటున్నారు. ఇక ఒక సినిమా పూర్తి చేసే వరకు మరో సినిమా గురించి ఆలోచించని విజయ్, గోట్ రిలీజ్ తర్వాత తన నెక్స్ట్ ప్లానింగ్ ఏంటన్నది చెప్పాలని చూస్తున్నారు. విజయ్ గోట్ తెలుగులో కూడా భారీ రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. ఐతే తెలుగులో ఈసారైనా విజయ్ వచ్చి ప్రమోషన్స్ చేస్తాడా లేదా అని తెలుగు ఆడియన్స్ డౌట్ పడుతున్నారు. విజయ్ గోట్ సినిమాకు యువన్ శంకర్ రాజా మ్యూజిక్ అందిస్తున్నారు. ఇటీవలే యువన్ శంకర్ రాజా విశ్వక్ సేన్ నటించిన గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాకు మ్యూజిక్ అందించారు. విజయ్ గోట్ సినిమాకు మ్యూజిక్ పరంగా కూడా యువన్ తన మార్క్ మ్యూజిక్ తో అందించారని తెలుస్తుంది. మరి గ్రేటెస్ట్ ఆల్ ది టైం గా విజయ్ తన సత్తా చాటుతారా లేదా అన్నది చూడాలి.

## నటన కోసమే పుట్టిన హీరో అతను!



డార్లింగ్ ప్రభాస్ అంటే ఇష్టపడని వారు ఎవరుంటారు? అతనంటే అందరికీ ఇష్టమే. అంతా ఎంతో ప్రేమతో అభిమానిస్తారు. ఇది అభిమానుల వెర్షన్. ఇక సెలబ్రిటీల విషయానికి వస్తే డార్లింగ్ పై ప్రేమ కురిపించేది ఎంతో మంది. అతడితో పనిచేసిన హీరోయిన్లు, దర్శకులు, నిర్మాతలు, నటీనటులు, టెక్నీషియన్లు అంతా డార్లింగ్ ని ఎంతో అభిమానిస్తారు. సెట్ లో అతడు నడుచుకునే విధానం పట్ల, పాజిటివ్ విటీ పట్ల ఎంతో గొప్పగా చెబుతుంటారు. ఇంతవరకూ డార్లింగ్ పై ఒక్క నెగిటివ్ కామెంట్ కూడా లేదు. ఇక వివాదాలకు తానెప్పుడు దూరమే. ఉంటే షూటింగ్ సెట్ లో ఉంటాడు. లేదంటే ఇంట్లో ఉంటాడు. మంచి ఫుడీ కాబట్టి! తనతో పాటు చుట్టూ ఉన్నవారికి కూడా ఫుల్లుగా పెడుతుంటాడు. ఇక నటన పరంగా డార్లింగ్ ని రాజమౌళి ఎంతగా అభిమానిస్తారో తెలిసిందే. 'ఆర్ ఆర్ ఆర్' సినిమాలో గెస్ట్ రోల్ ఇవ్వాలని రాజమౌళికి అనిపించలేదా? అని డార్లింగ్ అంటే 'నువ్వో షిప్ అని..ఆ షిప్ ని పడితే పెడతాం..అనవసరంగా ఆపెద్ద షిప్ ని తీసుకొచ్చి పెట్టడం భావ్యం కాదంటూ తన అభిమానాన్ని చాటుకున్నారు' జక్కన్న. ఈ నేపథ్యంలో తాజాగా పాన్ ఇండియా మేకర్ ప్రశాంత్ నీల్ కూడా డార్లింగ్ పై మనసులో మాటని బయట పెట్టాడు. ప్రభాస్ కేవలం నటన కోసం మాత్రమే పుట్టిన నటుడటంటూ కితాబిచ్చాడు. తానో డిఫరెంట్ యాక్టర్ అని...యాక్షన్ కథలు అతనికి సెట్ అయినట్లు మరో నటుడికి అంత ఈజీగా సెట్ అవ్వవు అని అన్నారు. సలార్ కథని ముందుగా ఎలాంటి స్టార్ ఊహలోకి రాకుండా మొదలు పెట్టినా తర్వాత ఇందులో ప్రభాస్ లాంటి హీరో మాత్రమే బాగుంటాడు? అన్న ఆలోచన వచ్చిందన్నాడు. ఇక ఇద్దరి కాంబినేషన్ లో వచ్చిన 'సలార్ సీజ్ ఫైర్' ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. 700 కోట్లకు పైగా వసూళ్లను సాధించిన చిత్రమిది. దీంతో సలార్-2పై భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి. ఆ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రారంభించే ఆలోచనలో ఉన్నారు. ప్రస్తుతం ఇద్దరు వేర్వేరు ప్రాజెక్ట్ ల్లో బిజీగా ఉన్నారు.

## స్వయంభూ నిఖిల్ ఏం చేస్తున్నాడు...!



నిఖిల్ 'కార్తికేయ 2', '18 పేజెస్', 'స్పై' సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ ను అందుకున్నాడు. ప్రస్తుతం ఈయన భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో 'స్వయంభూ' అనే సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. ఈ సినిమా ను భారీ బడ్జెట్ తో ఠాగూర్ మధు నిర్మిస్తున్నాడు. కొన్ని కారణాల వల్ల ఆలస్యంగా సాగుతున్న స్వయంభూ సినిమా షూటింగ్ ప్రస్తుతం మారేడుమిల్లి ప్రాంతంలో జరుగుతుంది. అటవీ ప్రాంతంకు సంబంధించిన షూటింగ్ ను నిర్వహిస్తున్నారు అంటూ యూనిట్ సభ్యుల ద్వారా సమాచారం అందుతోంది. నిఖిల్ తో పాటు ఇతర చిత్ర యూనిట్ సభ్యులు ఈ షెడ్యూల్ లో పాల్గొంటున్నారట. ఈ షెడ్యూల్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్ నిర్మాణం జరిగిందట. రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తున్న ఈ సినిమా కోసం ఎమ్ ప్రభాకరన్ ఆర్ట్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నాడు. ఈ సినిమాలో నిఖిల్ కు జోడీగా సంయుక్త మీనన్ నటిస్తున్న విషయం తెల్సిందే. భారీ అంచనాల నడుమ విభిన్నమైన కాన్సెప్ట్ తో ఈ సినిమాను దర్శకుడు భరత్ రూపొందిస్తున్నాడు.

నిఖిల్ గత సినిమాల ఫలితాల నేపథ్యంలో ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. నిఖిల్ ఈ సినిమాతో ఇదే ఏడాది ప్రేక్షకుల ముందుకు రావాలని భావించినప్పటికి కూడా షూటింగ్ ఆలస్యం అవుతున్న కారణంగా ఈ ఏడాది విడుదల సాధ్యమేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విడుదల విషయంలో త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# ఆంధ్ర యూనివర్సిటీ వీసీ చాంబర్లో చంద్రబాబు మరియు పవన్ కళ్యాణ్ ఫోటోలు ఉంచాలని డిమాండ్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లో వైస్ ఛాన్సలర్ ఛాంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలను ఉంచాలని ప్రొఫెసర్ సూరప్పడు కోరారు. ఆయన ఆంధ్ర యూనివర్సిటీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్నటువంటి రిలే దీక్షలో పాల్గొని పై విధంగా మాట్లాడారు. ఈ నిరసనలు గురువారానికి 13వ రోజుకి చేరుకున్నాయి. గత ప్రభుత్వంలో వీసీ చాంబర్లో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటాన్ని ఉంచారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటాన్ని ఉంచకపోవడంతో ఆయన్ని అవమానించినట్టుగా మరియు ఆంధ్ర యూనివర్సిటీ ఆంధ్ర ప్రదేశ్లో భాగమా కాదా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి అని డా॥ సురేష్ మీనన్ అన్నారు. ఈ సందర్భంగా బాధితులందరికీ కూడా న్యాయం చేయాలని డాక్టర్ అర్జునుడు ఈ సందర్భంగా కోరారు. వీసీ, రిజిస్ట్రార్లపై న్యాయ విచారణ జరపాలని డాక్టర్ శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆవుల రమేష్, అనపర్తి అప్పారావు, డాక్టర్ భాను త్రినాథ్, డాక్టర్ దాస్, డాక్టర్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# బ్రిటీష్ పార్లమెంటు, భారతదేశ పార్లమెంటు మధ్య పోలికలు, తేడాలు





| బ్రిటిష్ పార్లమెంటు | భారతదేశ పార్లమెంటు |
|---|---|
| 1. ప్రతి ఆరేళ్లకోసారి జీతాలు పెరుగుతాయి. | 1. ప్రతి మూడేళ్లకోసారి జీతాలు పెరుగుతాయి. |
| 2. రెండేళ్లకోసారి ఎంపీల పనితీరుకు రేటింగ్ ఇస్తారు. | 2. పనితీరుకు రేటింగ్ ఇవ్వడం లేదు. |
| 3. ఎంపీ పనితీరు 50శాతం కన్నా తక్కువ ఉంటే డిబార్ చేస్తారు. మళ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు ఖర్చులను ఆ ఎంపీ నుంచి వసూలు చేస్తారు. | 3. ఎంపీ పనితీరు 10 శాతం కన్నా తక్కువ ఉన్నప్పటికీ ఎటువంటి చర్య తీసుకోరు. ఆ ఎంపీ కోరుకున్నంత కాలం పదవిలో ఉండవచ్చు. |
| 4. ఎంపీకి రేటింగ్ ఇవ్వాలంటే ఎంపీ కార్యాలయం బయట ప్రజలకు రేటింగ్ ఆప్షన్ ఇస్తారు. | 4. అటువంటి విధానమేదీ లేదు. |
| 5. రెండుసార్లు కన్నా ఎక్కువగా పోటీ చేయరాదు. | 5. ఎన్ని సార్లయినా పోటీ చేయవచ్చు. |
| 6. ఎంపీ నిధుల వయాన్ని మూడు అంచెల నిఘా శాఖ పర్యవేక్షిస్తుంది. తనిఖీ చేస్తుంది. | 6. చాలా సందర్భాల్లో ఎంపీల కుటుంబ సభ్యులు, స్నేహితులు ఎంపీల నిధులను నిర్వహిస్తారు. |
| 7. అవినీతిపరులపై విచారణ వేగంగా జరగడానికి ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేస్తారు. | 7. అటువంటి విధానం, వ్యవస్థ లేవు. |
| 8. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసినట్లు రుజువైతే ఎంపీకి 15 సంవత్సరాలకు పైగా జైలు శిక్ష విధించవచ్చు. | 8. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసినట్లు రుజువైతే ఎంపీకి 3-6 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించవచ్చు. కానీ 1 శాతం మందికి కూడా శిక్ష పడినట్లు లేదు. |
| 9. గత 30 ఏళ్లలో కేవలం 5 అవినీతి ఆరోపణలు మాత్రమే వచ్చాయి. | 9. గత 30 ఏళ్లలో 18వేలకు పైగా అవినీతి కేసులు వచ్చాయి. |

# జిల్లా మూడవ కలెక్టర్‌గా ఎ.ఎస్. దినేష్ కుమార్ భాద్యతల స్వీకరణ





**పాడేరు, (విశాఖ సమాచారమ్):** అల్లూరి సీతా రామరాజు జిల్లా మూడవ కలెక్టర్‌గా 2013 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన ఎఎస్ దినేష్ కుమార్ గురువారం పదవీ భాధ్యతలు స్వీకరించారు.

స్థానిక శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆశీస్సులతో రంప చోడవరం, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, పాడేరు, రంపచోడవరం సబ్ కలెక్టర్లు ధాత్రి రెడ్డి, ఎస్. ప్రశాంత్ కుమార్, డిఆర్ఓ బి. పద్మావతి, డిపిఆర్ఓ గోవింద రాజులు, స్థానిక తహసిల్దార్ కళ్యాణ చక్రవర్తి నూతన కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి పాదాలకు ప్రత్యేక పూజలు నిర్వహించటానికి శ్రీ మోద కొండమ్మ దేవాలయానికి చేరుకున్న కలెక్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేసి ఆశీర్వాదంతో పాటు తీర్థ ప్రసాదాలు ఇచ్చి, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. పిఎంఆర్సి అతిథి గృహం చేరుకున్న జిల్లా కలెక్టర్‌కు సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట్, చింతూరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి చైతన్య స్వాగతం పలికారు. అనంతరం 12.10కి కలక్టరేట్ చేరుకున్న కలెక్టర్ అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. 12.14 గంటలకు సీటులో ఆశీనులై భాద్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, కలక్టరేట్ సిబ్బంది కలెక్టర్‌ను అభినందించారు.

# లీజు ఒప్పందం రద్దై 10 ఏళ్ళు అయినా ఫలితం లేదు : బిఎల్ నారాయణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నగరం నడి బొడ్డున మహారాణీపేట, దండు బజార్‌లోని విశాఖపట్నం జిల్లా కేంద్ర గ్రంధాలయం భూబకాసురుల పాలబడి 2010 సం॥లో కూల్చివేయబడినది.

పౌర గ్రంధాలయాల సేవా సమితి మరియు అనేక మంది పుర ప్రముఖుల పోరాట ఫలితంగా 2014 సం॥ లో 2010 సం॥ నాటి లీజు ఒప్పందం రద్దయింది. అయినా పలుకుబడిగల - ప్రముఖులు ఈ నాటికీ ఆ గ్రంథాలయం పునర్నిర్మాణం చేపట్టలేదని పౌర గ్రంధాలయ సేవా సమితి అధ్యక్షులు బి ఎల్ నారాయణ తెలిపారు.

డాబాగార్డెన్స్‌లో ఉన్న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ప్రెస్ మీట్‌లో పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులు, పురప్రజలు ఇంతటి మహానగరంలో సరైన ప్రభుత్వ గ్రంథాలయం లేక అనేక ఇక్కట్లకు గురి అవుతున్నారు. విద్య గురుంచి పెద్ద పెద్ద కబుర్లు చెప్పే, గత ప్రభుత్వాలలోని ప్రజా ప్రతినిధులు, అమాత్యులు, ఐఏఎస్ అధికారులు ఎవరికీ గ్రంథాలయం అవసరం పట్టలేదు.

జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన ఆ ఎకరం స్థలం ఈ రోజు సిఆర్‌పిఎఫ్ వారి ఆధీనంలో ఉంది. గ్రంథాలయ పునర్నిర్మాణం కోసం రాష్ట్రంలోని క్రొత్త ప్రభుత్వం వెంటనే పూనుకోవాలి. గ్రంథాలయ సంస్థకు నిధుల కొరత లేదన్నారు.

మాజీ ఎమ్మెల్సీ ఎంవి శర్మ మాట్లాడుతూ జి.వి.యం.సి ప్రజల ముక్కు పిండి వసూలు చేసిన ఆస్తి పన్నులో 8 % లైబ్రరీ సెస్సు మొత్తం రూ. 200 కోట్లకు పైగా గ్రంథాలయ సంస్థకు బకాయి పడి ఉందన్నారు.

గతంలో పవన్ కళ్యాణ్ అధికారం ఇస్తే నిర్మాణం చెప్పాడతామని చెప్పిన దానిని ఇప్పుడు నిలబెట్టుకోవాలని అన్నారు.

గ్రంధాలయ భవనం పునర్నిర్మాణం కోసం ఉద్యమం ఉధృతం చేస్తామని, ఈ పోరాటంలో పత్రికలు, టి.వి. ఛానెళ్ళు, మీడియా తమ సహకారం అందించాలని అన్నారు. సేవాసమితి అధ్యక్షులు, బి.ఎల్. నారాయణ, Retod కార్యదర్శి కె.త్రిమూర్తులు, కోశాధికారి, పి.మల్లేశ్వరరావు, ఆంధ్రా యూనివెర్సిటీ ప్రొఫెసర్, ప్రొ. సుబ్బారాయుడు, సిహెచ్‌విఎల్ఎన్ శాస్త్రి, పి.మణి, ఎన్.ప్రకాశరావు, లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

# గాయత్రిలో అంతర్జాతీయ మైక్రోబయోమ్ దినోత్సవం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్థానిక యం వి.పి. కోలనీలో గాయత్రీ విద్యాపరిషత్ డిగ్రీ మరియు పి.జి. కళాశాల (అటానమస్) సమావేశ మందిరంలో అంతర్జాతీయ మైక్రోబయోమ్ దినోత్సవం నిర్వహింపబడినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య డి.విజయ భారతి, గాయత్రీ విద్యాపరిషత్ ఇన్సిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ అండ్ టెక్నాలజీ యం.డి విచ్చేసి ఈ సంవత్సరం ఫీడింగ్ ఫార్ యువర్ గట్ అనే అంశంపై ఆరోగ్యవంతమైన ఉదర నిర్మాణానికి, మానవుల సర్వతోముఖ సంపూర్ణ ఆరోగ్యసాధనలో మైక్రో బయోమ్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఆరోగ్యానికి సహకరించే ఉపకార సూక్ష్మజీవులు, ఆరోగ్యానికి భంగం కలిగించే హాని కారక సూక్ష్మజీవులకు మధ్య వ్యత్యాసములు మానవ శరీరాలపై వాటి ప్రభావం గురించి విపులంగా వివరించారు. ఉదరంలో జీవనిర్మాణ ప్రక్రియకు సహకరించే మై బయోముల వృద్ధికి ఏ రకమైన ఆహారాన్ని స్వీకరించాలో పూసగుచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా- కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.యస్. బోస్ మాట్లాడుతూ ఆధునిక వైద్య విజ్ఞానంలో మైకోబయోమ్ విధానంలో అనేక రుగ్మతలకు చికిత్స చేయడం వలన ఇది సరికొత్త విధానమే కాకుండా మానవ జీవ పరిరక్షణలో ప్రధానపాత్ర వహిస్తుందని ప్రసంగించారు. తరువాత డి.గిరిధర్, డైరక్టర్, యు.జి. కోర్సు మాట్లాడుతూ 'మైక్రోబయోమ్' విషయంలో మానవులు అప్రమత్తం కావాలని ఆరోగ్య అప్రమతకి కావాలసిన ఆరోగ్య సంపదను రక్షించుకోవడంలో ఉదర పరిరక్షణ కీలకం అన్నారు. ఈకార్యక్రమంలో ఆచార్య ఐ.యస్. పల్లవి, డైరక్టరు, యం.సి.ఏ, డాక్టర్ యమ్. సుజాత, డా.శ్యామల డాక్టర్ శ్రావణ కుమార్, అన్య విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

# ఆయకట్టు చివరి భూములకూ సాగునీరు అందించాలి



**విజయనగరం:** ప్రస్తుత ఖరీఫ్ సీజనులో జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో వున్న ఆయకట్టు చివరి భూములకూ సకాలంలో సాగునీటిని అందించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా॥ బి.ఆర్.అంబేద్కర్ జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందాలని, ఏ ప్రాంతంలోనూ సాగునీరు అందలేదనే మాట వినిపించకుడదని చెప్పారు. ఏ ప్రాంతంలో రైతాంగానికి ఏ సమయంలో సాగునీరు అవసరమో గుర్తించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సాగునీటి కాల్వల నిర్వహణ, పూడికతీత వంటి అత్యవసర పనులకు అవసరమైన నిధుల ప్రతిపాదనలు అందజేస్తే ప్రభుత్వానికి నివేదించి నిధుల మంజూరు కోసం ప్రయత్నిస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ డా॥ అంబేద్కర్ గురువారం తన చాంబరులో జలవనరుల శాఖ ఆధ్వర్యంలోని సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి, ప్రస్తుత సీజనులో ఆయా ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తదితర అంశాలపై ఆ శాఖ ఇంజనీర్లతో సమీక్షించారు.


గత కొంత కాలంగా కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టక పోవడం వల్ల కాల్వల చివరి భూములకు సాగునీరు అందించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చీఫ్ ఇంజనీర్ వివరించారు. జిల్లాలోని తోటపల్లి, తాటిపూడి, ఆంధ్ర వంటి సాగునీటి ప్రాజెక్టుల కాల్వల్లో పూడికతీత పనులు, నిర్వహణ పనులు చేపట్టేందుకు, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో పనులకు కలసి రూ.4.30 కోట్లు అవసరం వుంటుందని జలవనరుల శాఖ ఉత్తర కోస్తా చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకర రావు, ఆయా ప్రాజెక్టుల కార్యనిర్వాహక ఇంజనీర్లు జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ నిధులతో వెంటనే పనులు చేపట్టే అవకాశం లేనప్పటికీ పరిపాలన పరమైన అనుమతులు తీసుకొని పంటలు లేని సమయంలో పనులు పూర్తి చేస్తామని చీఫ్ ఇంజనీర్ చెప్పారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి అధికారులతో సంప్రదించి నిధులు మంజూరు చేయిస్తామని మంజూరు చేయిస్తామని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌కు సంబంధించి ఎనిమిది ప్రాజెక్టులకు గాను తోటపల్లి, తాటిపూడి, మడ్డువలస, పెద్దగెడ్డ తదితర నాలుగు ప్రాజెక్టుల ద్వారా ఆయకట్టుకు సరఫరా చేసేందుకు అవసరమైన నీటి నిల్వల లభ్యత వుందని మరో నాలుగు ప్రాజెక్టుల్లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేవని, రానున్న రోజుల్లో వర్షాలు కురిసిన పక్షంలో వీటిలోనూ నీటి నిల్వలు పెరిగే అవకాశం వున్నదని ఇంజనీర్ లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని సాగునీటి ప్రాజెక్టుల నుంచి ఖరీఫ్ కు నీటి విడుదలకు తేదీలను కుడా నిర్ణయించామని చీఫ్ ఇంజనీర్ సుగుణాకర్ వివరించారు. జూలై ఒకటో తేదీన తాటిపూడి నుంచి, పదో తేదీన మడ్డువలస జలాశయాల నుంచి ఆయకట్టుకు నీటి విడుదల చేయాలని నిర్ణయించామని తెలిపారు. జిల్లాకు సంబంధించి సాగునీటి పనులకు సంబంధించి నిధుల విడుదల లేకపోవడం వల్ల పెండింగ్ లో వున్న వాటి వివరాలను అందించాలని కలెక్టర్ చీఫ్ ఇంజనీర్ కు సూచించారు.

తోటపల్లి ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణలో పెండింగ్ అంశాలను చీఫ్ ఇంజనీర్ ప్రస్తావించగా భూసేకరణ అధికారులతో సమీక్షించి వాటిని కుడా త్వరలో పరిష్కరిస్తామని కలెక్టర్ చెపారు.

సమావేశంలో తారకరామ తీర్థ సాగరం ప్రాజెక్టు ఈ.ఈ. పి.అప్పలనాయుడు, రెగ్యులర్ డివిజన్ ఈ.ఈ. సీతారాం నాయుడు, మడ్డువలస ప్రాజెక్టు ఈ.ఈ. హెచ్.మన్మధ రావు, జలవనరుల విభాగం ఈ.ఈ. తిరుపతి రావు, డి.ఈ.లు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు అండగా కూటమి ప్రభుత్వం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** హుద్ హుద్, తిత్లీ వంటి తుఫానుల వలన నష్టపోయిన మత్స్యకారులకు దక్షిణ నియోజవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రభుత్వం ద్వారా కోటి ముప్పై ఐదు వేల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ద్వారా మరిన్ని సంక్షేమ పథకాలు మత్స్యకారులకు అందిస్తామని అన్నారు. మత్స్య కారులకు ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానని ఎటువంటి కష్టం వచ్చినా వెంటనే సహాయ సహకారాలు అందించుటలో ముందు ఉంటారని ఈ సందర్భంగా తెలిపారు. ఫిషింగ్ హార్బర్‌లో త్వరలో అనేక కార్యక్రమాలు చేపడతానని, స్థానిక మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు జాగ్రత్తలు చేపడతామని ఈ సందర్భంగా తెలిపారు. సీసీ కెమెరాలు, నీటి సదుపాయాలు వంటి అనేక పనులు తక్షణమే చేపడతామని అన్నారు. కార్యక్రమంలో జేడీ విజయ్, మత్స్యకార పెద్దలు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Kakinada (K.B. Ramarao): Cell: 9949413661, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Bheemili (D.V.Chalapathi Rao) : Cell: 9849603258, Office (Raghunath) : 7013785256. Arilova (D.Venkatesh) : 73825 85777. Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Yelamanchili (P.S.N. Murthy) : 83095 38789 Anakapalli (M.Krishna Rao) : 63023 75539
Paderu (P.Ravi Kumar) : 94908 12271 Parvathipuram (S.S.Naidu) : 94900 27519 Chintapalli (Srinivas) : 94923 40861 Chodavaram (BVR Murthy) : 81431 22188

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.